స్నేహ గీతం

(కవితా సంకలనం)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారి
రెండువేల రూపాయల ఆర్థిక సహాయంతో ముద్రితం

సూర్యదేవర రవికుమార్

సాహితీమిత్రులు

మచిలీపట్నం

స్నేహా గీతం

కవితా సంకలనం

SNEHA GEETAM

A collection of Telugu
Poetry written by

సూర్యదేవర రవికుమార్
సహాయ సంచాలకులు,
పశు సంవర్థక శాఖ

Dr. S. Ravi Kumar, B.V.Sc.
Animal Husbandry

ISBN 81-900 357-2-X

తొలి కూర్పు : జనవరి 1999

First Edition : Jan. 1999

వెల : రూ. 20/-

PRICE : Rs. 20/-

ప్రచురణ సంఖ్య : 12
సాహితీమిత్రులు
మచిలీపట్నం

Publication No. 12
SAAHITHEEMITRULU
MACHILIPATNAM

ప్రతులకు :

1. ఎస్. స్వరూపరాణి
   పశువైద్యశాల
   గుడ్లవల్లేరు,
   కృష్ణాజిల్లా - 521 356.
2. సాహితీమిత్రులు
   27-431, పాతరామన్నపేట
   మచిలీపట్నం-521 001.
   © (08672) 21345

For Copies :

1. S. SWARUPA RANI
   C/o Vet. Hospital
   GUDLAVALLERU
   Krishna Dist., A.P. 521 356
2. SAAHITHEEMITRULU
   27-431,
   Machilipatnam-521 001.
   © (08672) 21345

ముద్రణ :

బృందావన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
బుట్టాయిపేట, మచిలీపట్నం
ఫోన్స్ : 21204, 27204

Printed at :

Brundavan Offset Printers
Buttaipet, Machilipatnam
Ph : 21204, 27204

కృతజ్ఞతలు

ఈ నా కవితలు నా మానసిక ఆనందం కోసం ఒక సంతృప్తి కోసం వ్రాసుకొన్నవి. ఇవి మరి కొందరి మనసులలో కూడా కొంత స్పందన కలిగించాయనటానికి వీటిని తమతమ పత్రికలలో ప్రచురించేందుకు ఎంపిక చేసుకొన్న ఆయా పత్రికా సంపాదకులే సాక్షులు. అందుకే ధైర్యం చేసి వీటిని మళ్ళీ - ఒకచోట చేర్చి సంపుటంగా - ప్రచురించబూనటం. ఇందులోని తొలి కవిత 'స్నేహ గీతం' మా వి.బి.జి. తిలక్ ను ఉద్దేశించినది. తిలక్, నేనూ తిరుపతి వెటర్నరీ కళాశాల కూర్చిన మిత్రులం. తిలక్‌ది అమలిన హృదయం. దానికి చిహ్నమే ఈ కవిత. అలాగే గత 20 ఏళ్ళకు పైగా ఆత్మీయతతో అల్లుకుపోయిన మరొక మిత్రుడు ముసునూరి చిన అప్పారావు. ఈ సహృదయులకు ఎప్పటినుండో ఇవ్వదలచుకొన్న కానుక ఈనాటికి ఇవ్వగలుగుతున్నాను. నా యీ కోరిక నెరవేరటానికి చేయూత నిచ్చిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారికి ముందుగా నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

ఈ కవితలను తమతమ పత్రికలలో ప్రచురించి ప్రోత్సహించిన భారతి, స్రవంతి, తెలుగు విద్యార్థి, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, యువకవిత తదితర పత్రికా సంపాదకులకు

ఈ సంకలనానికి ముందు మాటలు వ్రాసి నా కవితలలోని కవితా గుణాన్ని తూచిన మినీ కవితా విష్ణువు రావి రంగారావు గారికి

దీనిని తమ సంస్థ తరపున ప్రచురించిన మచిలీపట్నం "సాహితీ మిత్రులు" సంస్థకు

ఈ కవితా సంకలనాన్ని సుందరంగా అచ్చు తప్పులు లేకుండా ముద్రించి యిచ్చిన బృందావన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, మచిలీపట్నం వారికి

నా మనః పూర్వక కృతజ్ఞతలు.

బహుధాన్య మకర సంక్రాంతి

15-1-1999

సూర్యదేవర రవికుమార్

ప్రకృతినీ, మనిషినీ ప్రేమించిన సూర్యుడు

విమర్శ, కవిత్వం పరస్పరం సంపూరకాలు. రెండు సాహిత్య ప్రక్రియలు వైరుధ్యం లేకుండా ఒకే వ్యక్తి నుంచి వెలువడవచ్చు. నిజానికి ప్రతి కవిలోను విమర్శకుడు ఉంటాడు. అలాగే ప్రతి విమర్శకుడిలోను కవి ఉంటాడు. అనుభూతులకు స్పందించినపుడు కవి, శాస్త్రీయ దార్శనిక దృష్టితో అనుశీలించినపుడు విమర్శకుడు వ్యక్తమౌతారు.

దాదాపు 30 సంవత్సరాలకు పైగా సాహిత్య సేవ చేస్తున్న డా॥ సూర్యదేవర రవికుమార్ వ్యాసాలు అలనాటి మేటి సాహిత్య పత్రిక 'భారతి'లో తరచుగా వస్తూవుండేవి. ఆనాటి తరం సాహితీవేత్తలందరూ ఆయన సాహిత్య విమర్శలోని సత్తా తెలిసినవారే. నిడదవోలు, ఆరుద్ర ప్రభృతులు ఆయన చేస్తున్న సాహిత్య పరిశోధనను మెచ్చినవారే.

విమర్శకులలో కవిత్వం రాసినవాళ్లు కూడా ఉన్నారు. ఆర్.ఎస్. సుదర్శనం గొప్ప సాహిత్య విమర్శకులు. ఆయన మంచి కవిత్వం రాశారు. అలాగే చేరా కూడా కవితల సంపుటి ప్రచురించారు. ఇటీవల ద్వానాశాస్త్రి కూడా తమ కవిత్వం ప్రచురించారు... ఇపుడు సూర్యదేవర కూడా పాఠకులకు తమ కవిత్వాన్ని అందజేయటం సంతోషించదగిన విషయం.

సూర్యదేవర దృష్టి సమగ్రమైనది. ఏదో పరిమితమైన భావజాలానికి బందీ అయినవారు కారు. అలాగే ఏవో కొన్ని ఛందస్సులకు కుంచించుకుపోయిన వారు కారు.

ఈ 'స్నేహగీతం' లో వచన కవితలు, గేయాలు, పద్యాలు, మినీ కవితలు కూడా ఉన్నాయి. మనస్సులోంచి భావం వెలువడేటప్పుడు తగిన రూపాన్ని అదే ఎంచుకొంటుంది అనటానికి వీరి కవితలు సాక్ష్యం. ఆధునిక కవితా రూపం వచన కవితే అయినా లయాత్మకంగా ప్రవహించే పద్యాలు, గేయాలు వదులుకోగూడదు. తెలుగువాడి జీవనాడి లయ. తెలుగు సామెతల్ని పరిశీలించి చూస్తే పద్య పాదాల్లాగా లయాత్మకంగా వినిపిస్తాయి. సామాజిక సమస్యలమీద గేయాలు రాసి విప్లవ కవులు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసారు, చేస్తున్నారు. కానీ పద్యం దగ్గరే కొంతమందికి అపోహలు ఉన్నట్లున్నాయి. పద్యాన్ని కూడా ఆధునిక భావాల ప్రచారానికి ఉపయోగించుకుంటే అవి జనం నోళ్లలో నిలిచే అవకాశం పెరుగుతుంది. అందుకే ననుకుంటా, అవధాన విద్యా వాచస్పతి రాళ్లబండి కవితాప్రసాద్ పద్యం పేదవాడి సంగీతం అంటుంటారు. పద్యంలో చెప్పిన భావం పాడుకొనటానికి వీలుగా ఉంటుంది, పదికాలాలపాటు గుర్తుంటుంది.

ఇక విషయానికి వస్తే- యీ సంపుటిలో సూర్యదేవర అనేక విషయాల మీద స్పందించారు. వీటన్నింటినీ చూస్తే ప్రకృతిలో మనిషి ఒక భాగమని కవి భావించినట్లు తెలుస్తుంది. ప్రకృతినీ, మనిషినీ ప్రేమించిన సూర్యుడు డా॥ సూర్యదేవర రవికుమార్.

ఈయన కవిత్వంలో ఏకాకిగా నిలబడ్డ ముసలి వృక్షాలు, శిశిరాన్ని వసంతంగా మార్చి చూపిన చేవగల ప్రకృతి, పెనుచీకటి వలయంలో మినుకు మినుకు మనే చుక్కలు,

కష్టాల కారుమొయిళ్ళ మధ్య మెరుపుతీగలు కనిపిస్తాయి. జీవితపు ప్రమిదలో ఆత్మీయతా తైలం నింపేది, విరిలాంటి, నెమలి పురిలాంటి మనోహరమైన స్నేహం అగుపిస్తుంది. పూర్వం మలయమారుతంలా వచ్చి కురిసే మేఘం- ఈరోజుల్లో పెనుగాలి, పిడుగుల ఫెళఫెళలు లేనిదే వర్షం లేదని మారిన ప్రకృతిని మన కళ్ళ ముందుంచుతారు.

ప్రకృతిలో మనిషి ఒక భాగమని భావించే సూర్యదేవర దృష్టిలో మనుషులతో కూడిన ఈ సమాజం కూడా ప్రకృతిలో భాగమే. మితవచనం, హితవచనం, సత్యవచనం సదా ప్రయోగించే మనిషి సాక్షాత్తు మహర్షి లాంటివాడని, ఆయన లోకకల్యాణాన్ని కాంక్షించే దివ్యమూర్తి అని కవి భావిస్తారు. ఆరుగాలం అరిగేలా కరిగేలా శ్రమిస్తూ సంపదలను సృష్టించేవాడు ప్రతిఫలం పొందకుండా అడ్డుకునే రాబందుల దళవాయిల్ని నిరసిస్తారు. అందని ధరల చుక్కల చూపులతో పాటు, నిప్పులో కాలే మానవతా హృదయం పాఠకుడికి కనిపిస్తుంది. ఒక గాంధీ, ఒక సుభాసు, ఒక వివేకానందుడు మళ్ళీ ప్రభవించాలని, జనతకు మార్గం చూపించాలని కవి కోరుకుంటారు.

ఈ రోజు గొప్ప వాళ్ళనైనా సరే లెక్కచేయని దుస్థితులు పెరుగుతున్నాయి. ఇలాంటి రోజుల్లో ఎందరో మహాత్ముల్ని ఎంతో వినయంగా స్మరించుకొనే సంస్కారం సూర్యదేవర కున్నది. ఈయన చిత్తశుద్ధి మెచ్చదగినది. ఆరుద్ర, కరుణశ్రీ, త్రిపురనేని రామస్వామి చౌదరి, మధునాపంతుల, ఎన్.జి. రంగా, కాకాని పాపయ్య, తుమ్మల సీతారామమూర్తి, ఇందిరాగాంధి, ఎన్.టి. రామారావు ప్రభృతుల గురించి రాసిన పద్యాలు ఆ మహానుభావుల కృషిని కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నాయి.

చాలాకాలంగా పశుసంవర్ధక శాఖలో విశిష్టసేవ లందిస్తున్న డా॥ సూర్యదేవర రవికుమార్ పశువైద్యుణ్ణి ఎలా శ్లాఘిస్తున్నారో గమనించండి.

ఇదిగొ యిటనొప్పి యిట తీపు ఇచట మంట
యనిన రోగము పోల్చుట అబ్బురంబె !
మూగజీవుల రోగాల బోల్తు వీవు
జయము పశువైద్యుడా! నీకు జయము జయము!

'స్నేహ గీతం' కవితా సంపుటిని మచిలీపట్నం సాహితీ మిత్రుల ప్రచురణగా ప్రచురించటానికి అంగీకరించిన డా॥ సూర్యదేవర రవికుమార్ కు సాహితీ మిత్రులందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మా యిద్దరి మధ్య స్నేహం యిరవయ్యేళ్ళ నాటిది. ఈ స్నేహ బంధం వల్లనే ఆయన అడిగిన వెంటనే నేనీ నాలుగు మాటలు రాయటానికి సాహసించాను. ఆయన సహృదయతకు నా నమస్సుమనస్సులు.

- డా॥ రావి రంగారావు
31-1-1999

తెలుగు విభాగం
ఆంధ్ర జాతీయ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల
మచిలీపట్నం

ఈ రచయిత ఇతర రచనలపై పత్రికల, పండితుల

అభిప్రాయాలు

నందూరి బాపయ "విఘ్నేశ్వర చరిత్రము" గురించి -

"గ్రంథం సంగతి ఎలా ఉన్నా దీనికి పరిష్కర్త కూర్చిన విపులమైన పీఠిక ఎంతో విలువైనది. రవికుమార్ గారు ఎంతో పరిశ్రమ చేసి పెక్కు విషయాలను సేకరించి వినాయకుని గురించి వున్న గ్రంథాలను గురించీ, వినాయక క్షేత్రాలను గురించీ, కవిని గురించీ, అతని ఇతర కృతులను గురించీ కవి వాడిన కొన్ని స్వతంత్ర ప్రయోగాలను గురించీ వివరించారు. ముఖ్యంగా చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయాన్ని గూర్చీ మణికంఠేశ్వర వరదరాజాలయాలను గురించి ఎన్నో విషయాలను అందజేశారు".

భారతి మార్చి 1973

"మీ రీ గ్రంథమునకు వ్రాసిన 73 పుటల పీఠిక అమోఘముగా నున్నది. మీ సాహిత్యకృషి ఇంకను ఇతోధికముగా వర్ధిల్లుగాక యని ఆశీర్వదించు చున్నాను."

- నిడదవోలు వెంకటరావు 14-10-72

"మీ కృషి, ఆసక్తి, దక్షతా మీ పీఠికలో ప్రతిఫలిస్తున్నాయి. ఇటువంటి విపుల పీఠికలే ఉత్తరోత్తరా విజ్ఞాన సర్వస్వాలకు మళ్ళీ ఆకరాలు కావాలి.'

- ఆరుద్ర 20-9-72

"వ్యాస సుధ" గురించి -

"మీ పరిశోధనలు దీక్షతో చేస్తున్నవని ఆ వ్యాసాలు చాటుతున్నాయి. దీక్ష రాటుతేలి పరిపక్వమై ఫలప్రదమైనపుడే దక్షత వస్తుంది. మీరు ఆ దిశలో ప్రయాణిస్తున్నట్లు కన్పడుతోంది."

- ఆరుద్ర 29-4-89

"రచయితలోని ప్రతిభా వైవిధ్యానికీ, రచనా వైచిత్ర్యానికీ ఈ వ్యాససుధ నిజంగా ఒక ఉత్తమ, ఉన్నత సాహితీ సుధ"

- సంజీవదేవ్, తుమ్మపూడి

"పూర్వ పరిశోధకుల కృషిని తైపారు వేయడంలోనూ, అందలి నిజానిజాలను బేరీజు వేసి నిష్కర్షించడంలోనూ, సొంత అభిప్రాయాలను వ్యక్తీకరించడంలోనూ రచయితలకు గల సంయమనమూ సత్యప్రీతి, సరసవచో విలాసమూ, ఈ సంపుటిలో అడుగడుగునా సాక్షాత్కరిస్తాయి'

- తూమాటి దొణప్ప, హైదరాబాద్

"ఆరు నెలల తెలుగు కవితలు - ఒక పరిశీలన" గురించి

"వృత్తిరీత్యా వెటర్నరీ వైద్యుడైన రచయిత ఈ సమీక్షలో చక్కగా తెలుగు కవితలను డిసెక్ట్ చేయటం విశేషం"

- వనిత, అక్టోబరు '93

"ఇలాంటి పరిశీలన ఈమధ్య రాలేదు తెలుగులో"

- పాపినేని శివశంకర్, గుంటూరు

"ఆ ఆరునెలలు ఎప్పటివైనా చదువరికి విషయమూ వివరణ కొత్త గాబట్టి- కొత్త రుచిగానే ఉంటాయి."

- నాగభైరవ కోటేశ్వరరావు, ఒంగోలు

"వృత్తితో ప్రమేయం లేకుండా నిరంతరం సాహితీ వ్యాసంగం కొనసాగిస్తున్న మీ రసహృదయం ఆదర్శప్రాయమైనదని మా భావన."

- ఆచార్య భావన్, విజయనగరం

"పరిశీలనలో భావస్పష్టత, విశ్లేషణలో సాత్విక ధోరణి నన్ను బాగా ఆకట్టుకొన్నాయి. ఇది పరిశోధకులకు ఒక రిఫరెన్సులా ఉపయోగపడ్తుందని నా విశ్వాసం."


- రాధేయ, తాడిపత్రి

"మీరింత సునిశిత పరిశోధన చేయగలగటం నాకు పరమానంద మైనది. ఈ తాత్కాలికపు పరిశోధన అలా వుండగా శాశ్వతమైన కావ్య పరిశోధనం చేపట్టి మీ సాహితీ సామర్థ్యాన్ని వెల్లడించడానికి యత్నించ గలరని నమ్ముతున్నాను."


- ఊట్ల కొండయ్య, హైదరాబాద్

కవితానుక్రమణిక

స్నేహానికి చెరిగిపోని నిర్వచనాలు



వల్లూరుపల్లి బాలగంగాధర తిలక్



ముసునూరి చిన అప్పారావు

స్నేహ గీతం

నిజంగానే నువ్వూ నేనూ
నేస్తం ! మళ్ళీ కలిసి బ్రతికే రోజు వస్తే
కాలంకాని కాలమయినా
ఎదకోయిల ఎలుగెత్తి కూస్తుంది.
అమావాస్య చీకటయినా
సిరివెన్నెల విరబూస్తుంది
అక్షరాలలో తెలుపలేని ఆనందం మన
అంతరంగాలలో విలాసంగా తాండవిస్తుంది.

జీవితపు ప్రమిదలలో
ఆత్మీయతా తైలము నింపి
విరిలా నెమలి పురిలా విరిసిన స్నేహబంధపు
మెత్తని దూదిపింజలు వత్తులుగా వేసి
గుండెకు గుండెను ఒరపిడి చేసి
అగ్ని రేఖలు సృష్టిద్దాం
ప్రేమజ్యోతులు వెలిగిద్దాం
ఆనందదీపావళి నహరహమూ జరుపుకొందాం.

నిజంగానే నువ్వూనేనూ
నేస్తం! మళ్ళీ కలిసి బ్రతికే రోజువస్తే
కాలదేవత కాలిక్రింద ఖతమైన గతంలోని
బంగారం లాంటి రోజులు
స్మృతి పథంలో తొలకరి మెరుపులై మెరుస్తాయి
విరిసిన తలపుల మొయిళులు
ఉత్సాహపు ఉరుములతో
ఆనందవర్షధారలు స్రవిస్తాయి
ఏనాడో ఎదచేలో వెదజల్లిన స్నేహబీజాలు
మొలకలెత్తి పిలకలేసి

మళ్ళీ యిన్నాళ్ళకు
మమతల ధాన్యపురాసులతో
మనసుల బండ్లను నింపుతాయి
ఆ శుభవేళ
తాండవించే హర్షంతో
సంక్రాంతిని జరుపుకొందాం
సరదాల రంగుల రాట్నంపై
సవారీలు వేద్దాం
చిరకాలం వేధించిన చలికి
చింతనిప్పల చితి పేర్చుదాం.

నిజంగానే నువ్వూ నేనూ
నేస్తం ! మళ్ళీ కలిసి బ్రతికే రోజు వస్తే

గతంలోని సుఖాలతీపిని నెమరువేసుకొంటూ
దాని మాటున తొంగిచూచే వెతలచేదును వెక్కిరిస్తూ
పండని రసాలంలా పుల్లనైన బ్రతుకుకు
పూర్ణత్వం సమకూర్చుకొందాం
జీవిత చక్రపు వివిధగతులు
ఉగాది పచ్చడి రుచులులా
వింత అనుభూతిని సంతరించగా
వేడుకల ఉగాదిని జరుపుకొందాం
చిగురువేసి వృద్ధిపొందిన
చెలిమి మామిడి చెట్ల రెమ్మలు
మన జీవితప్రాసాద ద్వారబంధాలకు
మాయని పచ్చతోరణాలుగా కట్టి
పండుగలు జరుపుకొందాం
ఆ పచ్చదనాన్ని, ఆ పండుగదినాన్ని
అలాగే పదికాలాలు నిలుపమని
ఆ పరమాత్ముని వేడుకొందాం

నిజంగానే నువ్వూ నేనూ
నేస్తం ! మళ్ళీ కలిసి బ్రతికే రోజు వస్తే....

అవును. ఇంతకీ ఆ రోజు వస్తుందంటావా ?
ఆకాశాన మళ్ళీ అందాల హరివిల్లు
అగుపిస్తుందంటావా ?
నాకేమో ఏదో నమ్మకం
మనసులో ఒకమారుమూల
అలలా, అరుణుని అడ్డుకోవాలని
ఆకాశానికి పెరిగే వింధ్యగిరిలా
ఆశఒకటి బయలుదేరిన జ్ఞాపకం.
అదే నిజమైతే నేస్తం !

అడ్డు వచ్చిన బంధాలను అవలీలగా దాటుకొంటూ
ఎంతదూరమేగినా
ఎడంకాని ఎదురుపడని
చెలిమిబండి చక్రాలమై చివరిమజిలీ చేరుకొందాం
స్నేహానికి చెరిగిపోని చిహ్నాలై మిగిలి ఉందాం.

(భారతి, జూన్ '82)

ఎంత మార్పు !!

నిన్న మొన్నటివరకు
మలయ మారుత స్పర్శకే
జలజల వర్షించేది మేఘం
ఇప్పుడు
పెనుగాలి పిడుగుల
ఫెళఫెళలు లేనిదే
పిల్లమబ్బైనా కురియటంలేదు
ఎంత మార్పు ! ఎంత మార్పు !!
ప్రకృతిలోనే కాదు మానవ
ప్రకృతిలో కూడా
కొట్టి చంపకుండా
కొల్లగొట్టటం లేదు
రోగి రక్తతర్పణం లేనిదే
రోగం తగ్గటం లేదు
కరుణ, ప్రేమ, అనురాగాలనుకాక
కనక వర్షస్నానాన్నే
కాంక్షిస్తోంది మనసు
ఎంతమార్పు ! ఎంతమార్పు !!

(భారతి, జూలై 1984)

ఏకాకి

పాంచభౌతిక దేహానికి
పూర్తయినాయి అంత్యక్రియలు
ఏళ్ల తరబడి వేళ్లూని విస్తరించిన
అనురాగతరువు
ఎడతెరపిలేక విడుస్తున్నది
కన్నీటి పత్రాలను
వికారంగా రూపొందిన
మనోవృక్షానికి
ఇక పూయవు అనురాగ
కుసుమాలు
గతస్మృతుల భావనాబలంతో
ప్రతికొమ్మ తొడుగుతుంది
రెండాకులు
అంతే! అంతే!
అంతకు మించిన శోభ
ఆ తరువుకు ఇకరాదు
ముసలితనం వచ్చినా
మిసిమిని కోల్పోయినా
నిండుదనం వీడలేదు నిన్నటిదాకా
నేడేమో సగమూపిరి నిలబెట్టే
ప్రాణంతో
ఎలా తెలా పోతుందు
వెన్నులేని సస్యంలా
ఎగిరివచ్చే పక్షులైనా
ఎంతోసేపు ఉండటంలేదు
మునుపటిలా గూళ్ళుకట్టి
ముచ్చట లాడడంలేదు
"కనుల పండువయ్యేలా
నందనాన్ని నిర్మించాం
కదలిరా! మాతోటే కాలక్షేపం
చేతువు"
అని పిలిచే తన సంతతి
కామోద ప్రసవాన్విత
కటూ ఇటూ చెప్పలేక
పుట్టి పెరిగినట్టి నేల
పట్టు విడిచి పెట్టలేక
అర్ధాంగం కోల్పోయిన ఆ
ముదుసలి వృక్షం
ఏ కాకీ తోడులేక ఏకాకిగ
నిలిచిఉంది.

(భారతి, నవంబర్ '88)

శాంతి దీపావళి

'సర్వేజనా స్సుఖినోభవంతు' అని ఆమంత్రిస్తూ
ధ్యాన సమాధిలో కూర్చుని తేజస్స్వప్నాలు కంటున్నావా
లేలే మిత్రమా !

అణగారని యుద్ధ జ్వాలలు
ఆజ్యం లేకుండా ప్రజ్వరిల్లే మతోన్మాదాలు
హత్యలు, పదవీ దాహాలు
ప్రమాదాలు, ప్రాణ నష్టాలు
నగ్న నృత్యం చేస్తున్నాయి
చూడలేక ధ్యానంలో ఉన్నా నంటున్నావా!

నాకు తెలుసు
శిరీషకుసుమ కోమలమైన నీ హృదయానికి
అవి వజ్రఘాతాలని -

అయినా నీకు వినబడటం లేదా
ఉషోదయంలో అపశ్రుతులు పలుకుతూ
కుళ్ళిపోయిన మానవత్వపు మురుగు కాల్వల మీద
మూగిన రాకాసి దోమల సంగీతాల్లా
విశ్వవిపంచి విషాద తంత్రీస్వరాలు?

నీవు పసికట్ట లేదా
సాగర శయనుని వక్షః స్థలం మీది
వనమాలికా పరిమళాన్ని
మోసుకొచ్చే ప్రాతర్మందానిలంలో
రాత్రించరుల వాసనలు?
మానవ ప్రకృతి ప్రకృతినే మలినం చేస్తోంది.
నీ చుట్టూ ఉన్న మానవ దానవుల మాటేమిటి?

హృదయ మాలిన్యాన్ని ప్రక్షాళనం చేసే స్వస్తి వచనాన్ని
వారికి ఉపదేశించు మిత్రమా !
నీలో వెలిగే శాంతిదీపం
మరికొన్ని శాంతి దీపాలను వెలిగించనీ !
ప్రపంచానికి శాంతి దీపావళిని ప్రసాదించనీ !

(కృష్ణాపత్రిక, 15-11-84)

పునరంకితం

ఈ జీవితం చాలదు
బ్రతుకు బాటలో అనంతంగా
పాతబడ్డ ముళ్ళకంపలను పీకేందుకు
విషాద మానస సరస్సులో సదా
ఖుషీ తరంగాలు లేపేందుకు
స్నిగ్ధ జ్యోతులు వెదజల్లే స్నేహదీపాల మాటున
చేరిన అపనమ్మకపు చీకట్లను తొలగించుకొనేందుకు
ఫలప్రదం కాకుండానే చిట్లుతున్న
ప్రయత్నాండాలను పరిరక్షించుకొనేందుకు
కొడిగట్టే చైతన్యపు వత్తిని
కొసనలిపి కొనగోటితో ఎగద్రోస్తూ
ప్రజ్వలింప జేసేందుకు
దేశాభిమానాన్ని పెంచలేని
సాహంకార రాజకీయ చరిత్రుల
చక్కదిద్దేందుకు
జాతీయ గీతాలాపనకు జడమై నిలువక
జాగృతమై కదిలే జనగణాన్ని చూచేందుకు -

శరన్మేఘాలు శ్రావణ మేఘాలు కాలేవని
వంధ్యాపశువులు అభ్యుదయాన్ని సాధించలేవని
నాకు తెలుసు
అయినా
శిశిరాన్నే వసంతంగా మార్చి చూపిన
చేవగల ప్రకృతి
చిత్త స్థైర్యాన్ని పూయిస్తే
మహోత్సాహుడ నౌతున్నా
మనుగడ కర్థం కల్పించాలని
మంచి మార్పుకు కృషి చేస్తున్నా

(తెలుగు విద్యార్థి, జూన్ '92)

పలాశం

అనుభవాల అగ్ని కణాల మీద
అడుగు తీసి అడుగు వేస్తుంటే
ఒళ్ళంతా మొలుస్తున్నాయి ముళ్ళు
నెత్తురు ముద్ద లౌతున్నాయి కళ్ళు

వాగ్దానాల వానల్లో తడిసి
వాస్తవాలను వాసన పట్టలేక
పట్టిపోయింది ముక్కు

ప్రగతి ప్రగల్భాల భాంకృతులు
దౌర్జన్య దురాచార సంస్కృతుల ధిక్కృతులు
కబళించాయి కర్ణభేదిని
పిడుగుల్లా జడిపించే పేపరు వార్తలతో
తడబాటు పడుతోంది పిడికెడు గుండె

అవినయాదర్శాలతో
అవినీతి తైలాలతో
పంకిలమైన నైతిక భవన సోపానాలపై
నడవలేక జారిపడి
నడ్డి విరగగొట్టుకున్నాను

పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాడట
పడిలేచే కెరటానికి పతనం లేనే లేదట

అంగవ్రాతం చితికినా అదరిపోదు మనసు
అదను చూచి పలాశమై అగ్గిపూలు పూస్తుంది
టీవీ సిగ్నల్ లాగా తిన్నగా నడుస్తూ
జీవితాదర్శాన్ని చిరస్థాయి చేస్తుంది (తెలుగు విద్యార్థి, జూలై '94)

నేను - నీవు

చుట్టూ పొగను నింపుతూ
పరిసరాలను మలినం చేస్తూ
శలభాలను పొట్టన పెట్టుకొనే
చమురు దీపాన్ని నేను

పొగలు సెగలు లేక
పురుగుల ప్రాణం తీయక
వృద్ధి, క్షయము లేని
విద్యుద్దీపానివి నీవు

నేను అహంభావాన్ని
నీవు ఆత్మ స్థైర్యానివి.

(తెలుగు విద్యార్థి, జూలై '87)

మహర్షి

వచనాలు
వ్యాకరణానికే కాదు
వ్యక్తికీ అవసరమే
మిత వచనం
హిత వచనం
సత్య వచనం
సదా ప్రయోగించే మనిషి
సాక్షాత్తు మహర్షి

(శ్రీవాణి, జనవరి '86)

సుఖం

పెనుచీకటి వలయంలోనే
మినుకుమినుకు మంటూ
తన ఉనికిని తెలుపుకొంటుంది
ఓ చిన్ని చుక్క.
సుఖమనేదీ అంతే !
మెరుపు తీగలా
కష్టాలకారుమొయిళ్ళ మధ్య
క్షణకాలమే తళుక్కు మంటుంది.

దీపాలు వెలిగాయి

దీపాలు వెలిగాయి చీకటులు
తొలిగాయి
నలుదెసల మురిపాల వెన్నెలలు
విరిశాయి
పసిపాప నవ్వులా విరిసేమతాబాలు
విరజాజి పువ్వులా వెలిగే
పూవొత్తులు
వరుస లాడే కొత్త మరదళ్ళ
మాటలా
పైకెగిరిపేలే అవ్వాయిచువ్వాయిలు
ప్రాకారపు గోడమీద
ప్రమిదలు వరుసలు
ప్రాసాద భవంతిలో ప్రమదల
సొగసులు
వెలిగే కాంతి తోరణాలు
[illegible]లే పారాణి చరణాలు
దీపలక్ష్మికి పేరంటము నేడు
చెల్లెలా! మంగళహారతిని పాడు.
నిన్నటిదాకా సాగాయి వంచనా
హంకారాలు
నింగినితాకే నరకుని హాహాకారాలు
నేడు నిర్మల జ్యోతులతో
నిండాయి దిక్కులు
నీల్గిన నరకుని జూచిన మానవాళి
దృక్కులు
నేడు చిమ్మ చీకటిలో నిండైన
వేడుకలు
నరకుని చావును చెప్పే నాట్యదీప
మాలికలు
ఆకాశంలో లేకుంటేనేం అంద
చందాల జాబిల్లి
అందరి మనసులలో ఉప్పొంగె
సంతోషం పాలవెల్లి
అటు చూడు ఇటు చూడు ఎటు
చూడు దీపాలు
మటు మాయమయ్యాయి
ధ్వాంత ప్రకోపాలు
పంట పైరును గూర్చి రైతు
సల్లాపాలు
ఏయింట చూచినా ఎనలేని
మురిపాలు

(తొలకరి, నవంబరు '72)

శిఖరం చేరేదాకా

న్యాయార్జిత విత్తమనే నల్ల ఏనుగునెక్కి
నెమ్మదిగా అధిరోహిస్తున్నాను జీవిత శిఖరాన్ని
అవినీతిసింహాల అట్టహాసాలతో
అదురుతోంది విపుల పర్వత శిఖరం
కొండంత ఏనుగునైనా
కొట్టి చంపే సరదా- సింహాలకు
సత్తువలో మిన్నైనా
నెత్తురు కూడాశించని
నీతే ఊపిరి ఏనుగులకు.
నాకు తెలుసు
ఏ బండలమాటునో పొంచి దూకు సింహాలకు
ఏనుగు బలి అవుతుందని
ఎక్కే పర్వత శిఖరం నుండి
వెనక్కి విరుచుకు పడుతుందని
ఏనుగుతోపాటు చచ్చి
ఎత్తుతాను పునర్జన్మ
అయినా మళ్ళీ కథ మామూలే
అయితే ఒకకాలానికి
అంతుపట్టని అంటురోగం
అవినీతి సింహాల హతమార్చుతుంది
అంతవరకు జన్మలెత్తుతు
ఆశయాలకు వెన్నుచూపక
భద్రగజమును విడిచిపెట్టక
అద్రిశిఖరం చేరువరకు
దీక్షతో పురోగమిస్తాను
మానవత్వపు మల్లెపూవుకు
మొదటి రేకయి మురిసిపోతాను (యువ కవిత)

హృదయాంజలి

అరవై ఆరేండ్లా తనికి
ఆరని యౌవన మాతని కవితకి

అతడేమో బహుభాషా
సుమమరంద
మాస్వాదించే నేర్పరి
జ్యోత్స్నాశీతల తత్వాన్నీ
సూర్యకాంతి ప్రతాపాన్నీ
చవి చూపించే కవితల కూర్పరి

భావి కవుల కూపి రతని
భావానిల తరంగాలు
బహుభంగులు అతని కీర్తి
భామామణి సోయగాలు

సంతరించు సమగ్రాంధ్ర
సాహిత్యపు సంపుటాలు
పూర్వకవుల యశః పేటి
కెత్తిన నీరాజనాలు
చిరకాలం గుర్తుండే
సినిమా మాటలు పాటలు
పదికాలాలు నిలిచే
పరిశోధక వ్యాసాలు
అందరినీ అలరించే
ఆహ్లాద విన్యాసాలు
ఎన్నని చెప్పను ఆతని సుద్దులు
ఏవీ ఆ సాహిత్యానికి హద్దులు

అతడే అతడే ఆరుద్ర
ఆంధ్ర వాణి పాదాల హరిద్ర
తెలుగు కైతల చుక్కల నింగిని
తీరిచి వెలిగే ఆరుద్ర
ఆ మహనీయున కభివందనములు
అమలిన తారకు
హృదయాంజలులు.

(స్రవంతి, మార్చి '91)

గడియారం

గ్రామీణుల జీవితం గంటలముల్లు
పురప్రజల జీవితం నిమిషాలముల్లు
సిటీప్రజల జీవితం సెకండ్ల ముల్లు
మనిషి బ్రతుకు గడియారపు నడక
తరతమ భేదాల తోటి తలమునక.

(ఎక్స్‌రే, సెప్టెంబరు '87)

పునర్జన్మించు

నిన్ను చూస్తే ఎందుకీ సంఘానికి
నిలువునా మింగేయాలని కోరికో
అర్థంకాక అధిపాలౌతున్నావా తమ్ముడూ!
అసలు రహస్యం చెప్పనా !
ఈ సంఘం దృష్టిలో నువు
ఉఫ్ అంటే ఉలిక్కిపడే మేకవు
న్యాయపుటాకులు తప్ప
హేయపు నెత్తురుకూడెరుగవు
వెన్నవంటిది నీ హృదయం
అన్యాయాగ్నిని అది అడ్డుకోలేదు
అందుకే నీవీ సంఘంలో బ్రతికిబట్టకట్టలేవు
అందలాలనెక్కలేవు అమ్మఋణం తీర్చలేవు
అయితే . . .
నిన్ను మింగాలనుకొనే యీ సంఘమే
నీరుకారిపోతుంది
నిలువు గుడ్లేస్తుంది
చారలపులి వస్తుందంటే
సాహసం రూపు కట్టిందంటే
అందుకే పునర్జన్మించు
హడలెత్తించే పులివై కన్పించు
అన్యాయానికి ప్రతిగా గర్జించు
అప్పుడు నీ అడుగు జాడ
పుడమితల్లికి మర్రినీడ.

(స్రవంతి, మార్చి '88)

మార్పు లేని పాట

చదువు నమ్ముకొని సీటుకంటుకొని
చదివిన చదువుకు ఫలమింతేనని
జీతం రాళ్లతో కుటుంబ భారం
సరిపడ తూచే ఎన్జీవోలు

శ్రమను నమ్ముకొని చెమట చిమ్ముకొని
ఈ జన్మకు ఇక ఇంతే ననుకొని
కూలిడబ్బులతో కుటుంబభారం
సరిపడతూచే శ్రమైకజీవులు

గొడ్డు గోద పొలము పుత్రుల
సేవకు బ్రతుకును శిథిలం చేసే
తగ్గు మొగ్గుల తరాజు బ్రతుకుల
కొనసాగించే కర్షక జీవులు

ఎన్నాళ్ళున్నా ఎన్నేళ్ళున్నా
గొర్రెతోకలే గోష్పాదాలే

కష్టం నష్టం కనివిని యెరుగక
ప్రజలను ప్రభుతను పీల్చే జలగలు
ఇంతై అంతై ఎంతెంతో యై
విరాట్ రూపులై విజృంభిస్తే
తెల్ల ఏన్గులై తిరుగుతు ఉంటే
ఎన్జీవోల శ్రమైక జీవుల
కర్షక జీవుల కడునిరు పేదల
జీవన రీతులు జీవిత గాథలు

ఎన్నాళ్ళున్నా ఎన్నేళ్ళున్నా
గొర్రెతోకలే గోష్పాదాలే

(ప్రవంతి, 1983)

ఉదయగిరి

ఈ గిరి
ఉదయగిరి
తరతరాల తెలుగుజాతి
తరుగని పౌరుష జలధిని
ద్రచ్చిన మందరగిరి

జ్యోతిర్లతలు
దివ్యధాతుర్నిధులు
ప్రాణదానోషధులు
కలిగిన అపర సంజీవిగిరి

వెలిగొండల కిది ఉదయగిరి
ఉదయాద్రికి ఒక అస్తగిరి

ఓఢ్రరాజుల గజదళాలను
తెలుగువీరుల భుజబలాలను
విజయనగర సామ్రాజ్యనేతల
విచిత్ర వ్యూహ విన్యాసాలను
గోలుకొండ నవాబు సైనిక
ఘోషలను హయహేషలను
తరతరాల ఆటుపోట్లను
అవధరించి అనుభవించి
యుగయుగాల యువజనాళికి
నూత్న చైతన్యామృతధారను
అరుగాలము ప్రసాదించే అమృతఝరి

రోజు కొక్క దేవళంలో
ఉత్సవాలు జరుగుతుంటే

మూడువందల అరవై దేవతలతో
మురిసిపోయే ఉదయగిరిని
కాపు కాసే రామచంద్రుడు
శ్రీమదఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు
అడవిలోకి విసరబడగా
ఆలయాలే శిథిలమవగా
కొండ గుండే పిండి కాగా
శిథిలమైన కోటగోడలు
చెదరిపోయిన కట్టడాలు
జీర్ణమైన ఆలయాలు
వెలుగులేని గర్భగృహములు
ఛిన్నబోయిన శిల్పసంపద
ముక్కలైన విగ్రహాలు
రాళ్ళు రప్పలు తేళ్ళుపాములు
ఉదయగిరి యీనాటి సిరి

మళ్ళీ శ్రీ రఘురాముని
మనల నేలే పరంధాముని
దివ్యమంగళ స్ఫురద్రూపిని
దేవళంలో నిలుపగలిగితే
ఆరుగాల మఖండజ్యోతి
ఆ స్వామి సన్నిధి వెలుగుతుంటే
నిత్య పూజా నీరాజనాలతో
నిండు వేడుక మీరుతుంటే
నడుము వాల్చిన నాట్యరాణులు
నాల్గువైపుల నటిస్తుంటే
నవనవోజ్జ్వల వైభవాలతో
నాల్గు పల్లెలు నవ్వుతాయి

అప్పటి దేశీయుల జీవనం
నిత్యకళ్యాణం పచ్చతోరణం
అందుకు నలుగురూ పూనితే అంతో ఇంతో
రాయలనాటి రమణీయ రూపంతో
కనిపిస్తుంది మళ్ళీ ఈ ఉదయగిరి
లేనేలేదనిపిస్తుంది తనకు సరి.

నిర్ధూమ దీపాలు

ఈ దీపం కృషీవలుల శ్రామిక జన ప్రతిరూపం
ఎదుగూ బొదుగూ లేదని విడుస్తోంది బహు ధూపం
ఈ దీపం నిరుద్యోగ యువజన ఆర్త స్వరూపం
ఏ దారీ కనరాదను నిస్పృహ ధూమోపేతం
ఈ దీపం తనివారని రాజకీయ పద దాహం
ఇంకా పై కెదగాలను స్వార్థ ధూమావృతం
ఈ దీపం అవినీతి స్నేహ సుసంవర్ధితం
ఎడతెరపిలేక సృజిస్తున్నది పొగమబ్బుల నిత్యం
ఈ దీపం స్వార్థ రహిత సత్యసహిత జన హృదయం
నిర్ధూమంగా వెలిగే నిష్కల్మష స్వరూపం
పొగలు కక్కు దీపాలీ భువిలో మెండైనాయి
భరతమాత కనుల నశ్రుధారలనే నింపాయి
ఇది తరుణం చేయి కలుపు తమ్ముడా ఓ చెల్లెలా!
ఈ దుస్థితి తొలగిద్దాం ఈ పొగలను తరిమేద్దాం!
నిఖిల ప్రజా హృజ్జ్యోతులు నిర్ధూమంగా వెలిగే మార్గాలన్వేషిద్దాం
అచ్చపు వెలుగులు నిండిన అవని భరత భూమే
అని విశ్వానికి చూపిద్దాం
మనసుంటే వుంది మార్గం
భరత భూమే భావి స్వర్గం

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
నవంబరు '86)

తృష్ణతో నాస్తి . . .

ఎండదెబ్బకు గుండెమండింది భూమికి
ఎవరివ్వగలరిన్ని నీళ్ళా తల్లి దాహానికి
దొరువులు చెరువులు వాగులు వంకలు
కరువు రక్కసి కాలే కడుపులు
ఆ కడుపులు నింపే కాదంబినులు
కన్పించవు కనుచూపు మేరలో
ఇక ఎవ్వరివ్వ గలరిన్ని నీళ్ళా తల్లి దాహానికి
ఎండదెబ్బకు సెగలు కక్కుతు గుండెలవిసిన భూమికి
పాతికేళ్ళకే బట్ట గట్టిన పండితుని తలలా
పశువుల పచ్చిక బీళ్ళు !
కుళ్ళిన రాజకీయాల పేడ
విడుదల చేసే వాయువుతో
మండబోయే పల్లెటూళ్ళు !
ఆకాశంలోని పతంగుని పరాక్రమానికి వెరచి
పాతాళం వైపు పరుగులు తీసే జలసర్పాలు
నాటిని బయట పర్వేత్తించాలని
ప్రతి వేసవిలో జరిగే విఫల భగీరథ యత్నాలు
కాగితాల్లో కాల్వలున్నాయ్ ఖజానాలో డబ్బులున్నాయ్
ఎండిపోయే గొంతు తడిపే నీటి ధారలే నిండుకున్నాయ్.
కలలో నోరూరిస్తూయి కమ్మని పాయస పాత్రలు
మెలకువలో నీటి కోసం మైళ్ళ మైళ్ళ యాత్రలు
చిత్తశుద్ధితో ఆచరిస్తే
నిండు మనసుతో పూని చేస్తే
విరాట పర్వ పారాయణాలు
వృషభయాగ నిర్వాహాలు

మేఘరంజనీ రాగాలాపాలు
కృత్రిమ వర్ష ప్రయోగాలు
గంగా కావేరీ సంగమాలు
ఏవివ్వలేవిన్ని నీళ్ళీ నేలతల్లి దాహానికి
ఎండదెబ్బకు గొంతులెండే ప్రాణి లోకానికి.

(ఆంధ్రపత్రిక)

రాబందుల దళవాయి

ఆరుగాలం కండలన్ని అరిగేలా కరిగేలా
శ్రమచేస్తూ సంపదలను సృష్టించేవాడు - వాడు
కష్టానికి తగిన ఫలం పొందలేనివాడు.
చేసిన చాకిరి తెచ్చిన రూకలు
చేతి సంచినే నింపకపోతే
రేపటి వెలుగుల చూడనోచక
నేటి చీకటి కూపంలోపడి
పైకొనలేక, మనలేక
పరితపించేవాడు - వీడు.
వాడిని వీడిని అణగదొక్కుతూ
ఎవడయ్యా యీ మధ్య దళారీ ?
కష్టం నష్టం కనీవినీ ఎరుగక
వస్తాదులా ఒళ్ళు పెంచుతూ
ఎవడయ్యా యీ మధ్య దళారీ ?
కాయకృత కష్టాన్ని
న్యాయార్జిత విత్తాన్ని
కబళించే కసాయి !
రాబందుల దళవాయి !

(ఆంధ్రపత్రిక, 26-10-86)

కలలు

నిద్రిస్తున్న పద్మం గర్భంలో నినదించే తుమ్మెదలా
సుప్తమనోమందిరంలో స్వప్నాల జేగంటలు
కురిసే వెన్నెల జాలుల్లా విరిసే ముద్దబంతి పూరేకుల్లా
అంతరాలు లేని అనుభూతి తరంగాలు
మీట నొక్కితే పారే విద్యుత్తులా
మీటి నొక్కితే పాడే విపంచిలా
రెప్పపాటుకు తగ్గే కాలంలోనే
వేలమైళ్ళ ప్రయాణాలు; వింత వింత సంగతులు
కష్టాలలో సుఖాలు సుఖాలలో కష్టాలు
అంధకారంలో వెలుగులు రాకాసిశిలలో చీకటులు
కలలు కల్పిస్తాయి; క్షణం చవి చూపిస్తాయి

చైతన్యం నిద్రించే వేళ చిత్రంగా పుడుతుంది కల
సుందర నందనవనాల సొగసులు చూపిస్తుంది
వాంఛా గగన కుసుమాలను వాకిట్లో పూయిస్తుంది
నవరసాల ఫలాల రంగు రుచి చూపిస్తుంది
దాని బాహుబంధాలు భయంకర శృంఖలాలు
మరుమల్లెల మాలికలు విచ్చినకత్తుల బోనులు
ఆ బంధంలో చిక్కని ప్రాణిలేదు
ఆ అనుభూతి వర్ణించ శక్యంగాదు

నూరువాట్ల నిత్యశక్తితో వెలిగే
విద్యుద్దీపపు మీట నొక్కే వరకే
గదిలోని చీకటి రాకాసి నృత్యాలు !

అరుణ రాగ సందర్శనంతో
వేయిరేకులుగా కమలం విరిసే వరకే
గర్భస్వన భృంగాల గర్జారవాలు !

మానస గహ్వరంలో చైతన్య సింహం
నిద్రలేచి గర్జించే వరకే
స్వప్న గజబృందాల స్వేచ్ఛావిహారాలు !!

తమ్ముడూ! ఒక్కమాట

త్రాగి త్రేన్చ కుండానే
తల్లిపాలు రుచిలేవని
దాదిపాలకై తహ తహ
మానుకోవోయ్ తమ్ముడూ !

తెలుగుదనం పెరటి చెట్టు
పాశ్చాత్యం పుల్లకూర
అనుకోకోయ్ తమ్ముడూ !

షెల్లీకీట్సుల రచనల
కృష్ణా గౌతమి గలగల
పోల్చకోయి తమ్ముడూ !

తిక్కన సోమన వేమనల
తెలుగు పలుకు బడుల నేర్వ
తీరిక లేదన కయ్యా !

"పర భాషా లతల పెంచ
మన భాషా ఉపవనాన్ని
కాల్చ బోకు తమ్ముడూ !

తనకు మాలిన ధర్మమెప్పడు
తగదు తగదను తెనుగు మాటను
మరవ బోకోయ్ తమ్ముడూ !

(తెలుగు విద్యార్థి)

చెల్లీ! దీపం వెలిగించు

చీకటి కడుపును చించే చిరుదీపం నీ ముంగిట
నిర్భయముగ వెలిగించు నిర్మలాత్మతో చెల్లీ !

నీ దీపం మాతృకగా నిఖిల ప్రపంచాన కోట్ల
పుత్రికలుదయించాలి పుడమి కడుపు చల్లగా

మలినాత్ములు రణదాహులు వెలిగించిన దీపాలతో
పుడమి తల్లి మేన కాక పుట్టి ఉడికి పోతున్నది

చెల్లీ! నీలా నిర్మల చిత్తులు కావాలి ప్రజలు
వెలిగించే దీపావళి వేడుక కూర్చాలి ధరకు

పుడమితల్లి కాకతీరి పులకరించి నవ్వుతుంది
ఆ నవ్వుల తెలివెన్నెల అక్షయమై నిలుస్తుంది

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక)

మర్రి నీడ

శాఖోపశాఖలుగా విస్తరిల్లిన
ఊడలపట్టులతో పటిష్టమైన
స్వాతంత్ర్యం మర్రిచెట్టు నీడలో
సమభావంతో సుఖించే జాతికి
వెన్నుమీది వ్రణంలా
కంటిలోని ముల్లులా
కలవర పెడుతున్నాయి
కరుణలేని కసాయిల ఉన్మత్త చేష్టాంకురాలు
మర్రినీడనే పెరుగుతున్న ముళ్ళచెట్ల గుంపులు
సుగమసౌఖ్య ప్రదేశాన్ని
దుర్గమంగా, కంటకావృతంగా మార్చే
ఆ భావ బీజాలు ఎంతటి బలీయమైనవో
ఆలోచించాలి అందరూ.

శిక్షా ఉష్ణోదకంలో మరగించి వాటి
అంకురించే శక్తినంతా అపహరించాలి
సౌఖ్యప్రదమౌ మర్రినీడను
వ్యాప్తిచెందే మొండిమొలకల
పురిటిలోనే సంధి కొట్టాలి.

(ఆంధ్ర పత్రిక 7-9-86)

కవితా జ్యోతి

కుకవులు ఒకవైపున
సుకవులు ఇరువైపుల
వెలిగించిన క్రొవ్వొత్తే
నిజానికి కవిత్వం

ఒక వైపున వెలిగిస్తే
పైన వెలుగు క్రింద ఇరులు
ఇరువైపుల వెలిగిస్తే
ఇల అంతా వెలుగు సిరులు

చిత్తశుద్ధి దాని కాత్మ
విశ్వహితము దాని మతము
నైర్మల్యం దాని రీతి
రుచిరార్థం దాని స్వార్థం

ఈ తత్వం ముద్దచేసి
అక్షరాల వత్తివేసి
తమ్ముడా! వెలిగించరా!
వెలుగులో జీవించరా!

(తెలుగు విద్యార్థి, మార్చి '87)

బొమ్మల కొలువు

సవరించాం మా యింట్లో చక్కని బొమ్మల కొలువు
ఒక్కసారి చూడరండి

ముఖ్యులైన దేవతలు ముందే కూర్చున్నారు
ఇష్టకామ్యార్థసిద్ధి నిస్తామంటున్నారు

చలికాలపు తల్లికడుపు చల్లగుండాలి అంటూ
దుప్పటిలో కొత్తజంట దూరి అంటున్నారిరుగో

ఇదుగో ఇది భోగిమంట హృదయోత్సాహపుపంట
కాదుకాదు - అనావృష్టి కల్పించిన కడుపుమంట

బంతిపూలు కోళ్ళపోరు బలురంగుల రాట్నాలూ
సిరిముగ్గులు గంగిరెడ్లు హరిదాసులు మామూలే

తుఫానులో వరదల్లో కొంపా గోడూ పోయి
అల్లాడే పేదరైతు అడుగో ఉన్నాడిక్కడ

తిండి కొరకు తిరుగుతూ ఎండుపుల్లలైన యీ
శ్రమజీవులు అనావృష్టి రాకాసికి బలిపశువులు

మెదడువాపు వ్యాధివచ్చి మృత్యు గహ్వరాన చొచ్చి
పితరుల శోకాబ్ధి ముంచి వెళ్ళిన పాపాయి యితడు

ఆహ్వానపు లేఖ గూర్చి అధిక కాల వ్యయంచేసి
పలు కష్టాలలో చిక్కిన నిరుద్యోగు లరుగరుగో

ఇదుగో సంక్రాంతిలక్ష్మి హితకారిణి వరదాయిని
వరదహస్త మిస్తున్నది వచ్చిన వారందరికీ

ఒక్కసారి చూడ రండి
సవరించాం మా యింట్లో చక్కని బొమ్మల కొలువు

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక)

కలం వెక్కిరిస్తోంది

చింతచెట్టును చూచాను
చిగురుతో సింగారించుకొంటోంది
వేపవైపు చూచాను
విరబూచి తూగుతోంది
మల్లెకేసి చూచాను
మత్తుగొలుపు సువాసల జల్లును కురిపిస్తోంది
రంగు తిరిగి పండిన రసాలతో రసాలం
రమ్మని ఆహ్వానిస్తోంది
వలపు కౌగిళ్ళలో వాలమని
ఒలికే సుధలను గ్రోలమని
కోరుతోంది వసంతుని
కుసుమించిన వని
పంచ జనుల నానందపు టంచులపై నిలబెడుతూ
ప్రవచిస్తోంది కోయిల గళం
ప్రకృతిలో మధురమైన కలకలం
పరవశించే ప్రకృతితో పాలుపంచుకోలేక
సాటి వ్యక్తితో గళం కలిపి పాటపాడలేక
వసంతం వచ్చినా నేనింకా శిశిరంలోనే వున్నా
మోడైన మానస వృక్షపు నీడన
రాలిన బాధల పండుటాకులలో గల
కాల కీటక లిపులతో కుస్తీపట్లు పడుతున్నా
గుణింతాలను పలుక లేక గొణుగుకొంటున్నా
కన్ను మూసుకొంటే కన్పిస్తోంది వన్నెచిన్నెల వసంతం

కన్ను తెరిస్తే కార్చిస్తోంది కన్నీటిని శిశిరం
ఒకటి మధురం మరొకటి దుర్భరం

మనసును మాలిన్య భావాలతో నింపక
మమతాను రాగాలతో కూర్చాలని
బ్రతుకును బాధాకంటకాలలో త్రిప్పక
బంగారు బాటపై నడపాలని
దుర్భరాన్ని మధురంగా దిద్దుకోవాలని
నిబ్బరంగా జీవితంలో నిలబడాలని
కలంపట్టి కవితలల్లి గళంఎత్తి పాడాను
చైతన్య స్రవంతులను జాతికి అందించాను

కాని...
చివరకు నేనేమయ్యాను !
బాధల బందిఖానాలో చిక్కి బరువైన బ్రతుకులో మ్రగ్గి
ఉత్సాహం ఉడిగిపోయి చైతన్యం చచ్చిపోయి
బెల్లంకొట్టే రాయిలా మారిపోయాను
నిత్యవసంతంగా పల్లవించి పరవశించిన హృదయం
శాశ్వత శిశిరంగా జీవం ఉన్నా లేనట్లే
మోడయింది మొద్దు బారింది

అయితే...
మారుతున్న ప్రకృతిలో మార్మోగుతోంది
మధుర వసంతాల కలకలం
వికృతంగా నవ్వుతూ నన్ను
వెక్కిరిస్తోంది నా కలం.

కర్తవ్యం

నిస్సహాయతా పర్వంలో నిలబడి
సర్వంశూన్యమన్న మనసుతో
నిట్టూర్పులు విడిచి ప్రయోజనంలేదు తమ్ముడూ!
నీ అదిరిపాటు ఆలోచనల ఆవేశకావేషాలు
అనుకొన్నపనిని సాధించలేవని
అర్థంకాలేదా ఇంకా !

నీ చుట్టూ నానాజాతివృక్షాలు -
వాటిలో
తన నీడన మరొకదాన్ని బ్రతుకనీయని దొకటి
పరాశ్రయమే పరమావధిగా గలది వేరొకటి
చుట్టూ తనవాళ్లనే సృష్టించుకొనేది ఇంకొకటి
విశాలంగా విస్తరించిన ఏకఛ్ఛత్రాధిపతి మరొకటి
వీటితో పోటీపడలేని కొన్ని
విసురుగాలితో దూరంగా పంపిస్తున్నాయి తమ బీజాల్ని

తమ అస్తిత్వాన్ని నిలుపుకోలేక
క్రమంగా రూపుమాసిపోతున్నాయి మరికొన్ని
అయినా ఎన్నో వృక్షాలు
అందిస్తాయి అమృతఫలాలు
నిస్స్వార్థబుద్ధితో ; నిజాయితీ మనసుతో
అవనత శీర్షాలతో ; వినయ హృదయాలతో
ఎన్నో రాక్షసవృక్షాలు, మరెన్నో రాకాసి తీగలు
కఠోర కంటకాలతో, రంగుల విషఫలాలతో
వాటిని కబళించాలని కాటేస్తుంటే

వాటిని ఛేదించటానికి నువ్వెత్తిన గండ్రగొడ్డలిని సైతం
వాటేసుకొని ఇరికించు కొన్నాయి

కర్తవ్యతామూఢుడివి కాకు
కావలసినది నిప్పవంటి ఆలోచన నీకు
పుట్టించు వెచ్చగా దానిని నీ మనసులో
ప్రజ్వరిల్లజేయి విశ్వశాంతి కళ్యాణకాంక్షాజ్యంతో
అప్పడు అది దహిస్తుంది
ఆ కంటక సమూహాన్ని
అహమహమిక తో పోటీపడుతున్న
అసురప్రవృత్తి మానవారణ్యాన్ని

(స్రవంతి, జూలై '91)

ఈ తీగలు విరబూయాలి

వానాకాలంలో నిండి
ఎండా కాలంలో ఎండే చెరువులా
ఇంటర్వ్యూల అనుభవాలతో
నిండి ఎండే హృదయాలు

డిగ్రీల తుపాకీలతో ఆడే
ఉద్యోగాల వేటలో
పదే పదే ప్రయత్నించినా
ఫలితం మాత్రం నిట్టూర్పులు

"అపాయింట్‌మెంట్స్" పేజీలలోని జీతాల అంకెలు
ఆశతో నోరూరిస్తుంటే
దరఖాస్తులు రుసుములు వగైరాలకై
ఖాళీయైన జేబుల్ని
దిగాలుగా తడిమే చేతులు

తమ్ముడి చదువో చెల్లెలి పెళ్ళో
తండ్రి చేసిన అప్పుల కుప్పో
తల్లి జబ్బుకు మందుల ఖర్చో
తలపుకు వస్తే వణికే మేనులు

ముత్యాల్లాంటి మనసులలో
మూగే పగడపు కాంతులు
రోజు రోజుకు హృదిలో పెరిగే
రుధిర జ్యోతిర్జ్వాలలు

ఈ స్థితిలో ఉన్నారు ఈనాటి నిరుద్యోగులు
వసంతాన్ని కాంక్షిస్తూ మూగలైన కోయిలలు
చల్లగాలి దయకోసం సాగే మేఘమాలికలు
స్వాతి చినుకుకై తహతహ లాడే ముత్తెపు చిప్పలు

దేశమాత కన్నుల్లో పెంపొందే శుక్లాలు
ఆనకట్ట ఆయకట్టు లేని వరద గోదారులు
అర్రుమీద కాడిపడని మకురు కోడెగిత్తలు
తెలుపు నలుపు టీవీలో కనిపించే హరివిల్లులు

ఏరీ వీరికి ఒకదారి చూపు సమర్థులు
సమ్యక్ దృష్టితో ప్రగతిని సాధించే భగీరథులు
నీ అండగ నేనున్నా నేనున్నా నను నేతలు
కనికరముతో కరము పట్టి కదిలించే కరుణాత్ములు

ఒక గాంధి ఒక సుభాసు ఒక వివేకానందుడే
మళ్ళీ ప్రభవించాలి మార్గం చూపించాలి
స్వశక్తి పై స్వబుద్ధితో సాగే మంత్రం నేర్వాలి
నిరుద్యోగ లతలను నిండుగ పూయించాలి

సమాజాభివృద్ధికై సాగే యువశక్తి ఉన్న
దేశానికి ప్రతిరోజూ దీపావళి పర్వదినం
అమావాస్య చీకట్లలో అలమటించు యువకులున్న
దేశం రాహుగ్రస్త దివాకరబింబం

పూయలేని లతలులేని పుణ్యభూమి భరతావని
కావాలి విశ్వానికి కమ్మతావి నీయాలి.

(స్రవంతి)

పట్టుగొమ్మ

నిజం! నన్నునమ్ము
నేనెప్పుడో మరణించి ఉండేవాడిని
నీ వన్నెల చిన్నెల చాచిన చేతులు
నామనసును బంధించి ఉంచకపోతే
ఓ హరివిల్లూ! నే నెప్పుడో మరణించి ఉండేవాడిని
మోసమనే వర్షానికి తడిసి
పాకుడు పట్టిన బండరాళ్ళ బ్రతుకు బాట మీద
తీగమీద బేలన్స్‌గా నడిచే సర్కస్ కుర్రాడిలా నడుస్తున్నా
జారాయి కాళ్ళు ఎన్నో మార్లు
అయినా పడనీయకుండా
ఆప్యాయంగా పొదివి పట్టుకొని
ఎలా నిలబెట్టి నడిపిస్తున్నావో నీకూనాకే తెలుసు
నిరాశాదావానలం సుడిగాలిలా చుట్టుముట్టి
నిలువునా దహించ బోయేవేళ
నీ దయావృష్టేగదా కాపాడిందినన్ను
అనాలోచితంగా వేసిన అడుగు
అవమానాల ఊబిలో పడితే

ఊతమిచ్చి లేపావు నీవు
భుజంతట్టి చూపావు సరైన తెరువు.
అవును
అధ్వాన్నపు జీవనాధ్వంలో
అడుగుతీసి అడుగేస్తే నిలబడలేని మార్గంలో
ఒరిగి పడకుండా ఓర్పుచెడకుండా
సగందూరం పైగా సాగి వచ్చిన వాడ్ని
ఇప్పుడు నేను చెప్పగలను దృఢంగా
నాపురోగమనానికి ఊపిరి
నీ వసంతరాగాంచితమౌ బాహుసిరి
ఓ హరివిల్లూ! నీవు రంగురంగుల విల్లువే కాదు
పొంగే బృహదాశా తరంగానివి
పూచే భవిష్యత్ స్వర్ణకుసుమానివి
వీచే ఆత్మ స్థైర్యఝంఝానిలానివి

నీ వన్నెల చిన్నెల చాచిన చేతులు
నా మనసును బంధించి ఉంచకపోతే
నే నెప్పుడో మరణించి ఉండేవాడిని
నిజం! నన్ను నమ్ము

(స్రవంతి, జూలై '88)

రైతు సూక్తము

పాలు ఏరులై పొంగాలన్నా
పంట మేరువై ఉండాలన్నా
నిరంతర కృషి నీదే గదన్నా!
నిత్య సమస్యల రైతన్నా!

చందమామతో నీకగు నుద్ది
సగము లేమిడి సగము సమృద్ధి
నిండుదనంతో నిలిచిననాడు
నిను కబళించాలని చూస్తుంటారు.

భూదేవికి నీ చెమటే చలువ
భోగులకు నీ కండే తిండి
ఎముక లేని నీ చేయే కాదా
ఎరుగనీయనిది ప్రజ క్షుద్బాధ.

గొడ్డు-బిడ్డల నొకటిగ చూచే
దొడ్డ హృదయ మింకెవరి కున్నది?
కలిమిలేములకు కష్టసుఖాలకు
కలగని మన సింకెవ్వరికున్నది?

దేశానికి వెన్నెముకవు నీవే
దినగండం నూరేళ్ళూ నీకే
మిన్ను విరిగినా పన్ను పెరిగినా
మిన్నకుండేది నీ వొక్కడివే

ఈతిబాధల ఈగలతో, అవి
నీతిపరుల జోరీగలతో
సతమతమయ్యే నీ బ్రతుకున సుఖ
శాంతి సంపదలు సున్నా అన్నా!

రాజులు మంత్రులు రాజకీయములు
రైతుకు మిత్రుని బోలిన శత్రులు
పంచభూతముల ప్రకృతి ఒకటే
ప్రాణమిత్రము; ప్రణుతపాత్రము

(స్రవంతి, డిసెంబర్ '87)

నివాళి

నన్నయ మొదలు సినారె దాకా
ఎందరెందరో కవిపుంగవులు
ఎవరి రచనలో ఏ ఘట్టంలో
ఏ పద్యంలో ఏ పాదంలో
నీకేదైనా తెలియకపోతే
నిడుదవోలు వారి నడుగు
నిలబడ్డపళంగా నీ సందేహాన్ని
నివృత్తి చేస్తారని నే విన్ననాడు
ఆయనంతటి ఘనుడా ? అని
అనుకొన్నాను మనస్సులో.
కాని . . . వారి
ఉదాహరణ వాఙ్మయంలో
ఓనమాలు దిద్దుకున్నప్పుడు
తెలుగు కవుల చరిత్ర పుటల్ని
తిరుగవేస్తున్నప్పుడు,
వారు
ఆంధ్రభారతి లావణ్య రేఖలను
భారతీ దర్పణంలో
ప్రతిబింబింప జేసినపుడు
ఆంధ్ర సాహిత్యాకాశంలో
అహర్నిశలూ మెరిసే
అద్భుత వ్యాస తారకల
నవతరింప జేసినపుడు
ఆ అమోఘ పాండిత్యం

ఆ అద్భుత ప్రజ్ఞ
ఆ నిరంతరానుశీలనం
ఆ నిర్మల మనో వ్యాపారం
సువ్యక్తమైనాయి
సుదర్శనమైనాయి
అనుకోకుండానే వారికి
అంజలి ఘటించాను
ఆయనెంతటి ఘనుడో ! అని
ఆశ్చర్యపోయాను
సాహిత్య సముద్రాన్ని
ఆపోశనం పట్టిన
అభినవ అగస్త్యులు వారు
ఆజన్మాంతం మథించి
అహర్నిశలూ అమృతాన్ని పంచిన
సాహిత్య బాంధవులు వారు
ఆ విమర్శక శిఖామణి
అస్తమించారంటే
ప్రాచీన సాహిత్యపు బాగోగులు
ప్రపంచానికిక చాటేదెవరు ?
తమవాదమే వేదమన్న వారిని
తట్టి నిజమిదని చెప్పి
తగ్గమనే వారెవరు ?
తెలుగు పలుకుల తీరుతెన్నులు
వెలికి తీసిన విద్యారత్నము
'బహుళాంధ్రోక్తి మయ ప్రపంచ'
పరిశోధనా పరమేశ్వరులు

విమర్శక లోకంలో స్థిరంగా
వెలిగే కళాప్రపూర్ణులు
జంగమ గ్రంథాలయంగా
జగమెరిగిన మనీషి
ఉన్నా రెందరో వారి రచనలు చదివి
ఉత్తేజితులైన భాషాభిమానులు
నడుస్తున్నా రెందరో వారి రచనాపథాన్ని
అనుకరిస్తూ; అనుక్రమిస్తూ
వారి రచనల మణిదీపాలు
భారతికిచ్చిన హారతులు
అమలినమైనవి
అద్భుతమైనవి
అక్షరమైనవి.

(భారతి, డిసెంబర్ '85)

వార్తా పత్రిక

చీకటి కడుపును చించుకొని
నెత్తురు ముద్ద సూర్యుడు నిక్కిచూడక ముందే
వార్తలతో వచ్చి పడుతుంది
వాకిట్లో దినపత్రిక.

చీకటిలా అలముకొన్న
చిన్నా పెద్ద అక్షరాలలో
కొన్ని ముత్యపు ముగ్గులు
కొన్ని నెత్తురు ముద్దలు

అవినీతి సస్యక్షేత్రంలో
అచ్చోసిన ఆంబోతుల రవాలు

అత్తింటి ఆరళ్ళలో
కామాంధుల కబంధహస్తాలలో
అల్లాడే పడుచుల ఆక్రందనలు
ఎన్ని వినిపిస్తాయో!

అధికారం అనంత ఆకాశంలా కన్పిస్తుంటే
సామాన్యుల స్వేదంతో
అవినీతి ధూమంతో
అవకాశాల మెరుపులతో
అనుచర పవనాలతో
కనకవర్షాన్ని కురిసే
కారుమబ్బుల్ని సృష్టించి
ఫలమనుభవించే ప్రవీణులెందరు కన్పిస్తారో!

నిన్నటి సిద్ధాంతాలు చెరిపి
ఊహించని రీతిలో రేపును మలిచే
విజ్ఞాన శాస్త్ర ప్రగతి క్రమం
వింత వెలుపులు పుట్టిస్తుంటే -
యంత్రాంగం స్వాహాతంత్రాంగమై
తంత్రం కుతంత్రమై
రాజకీయం అరాజకీయమై
అక్షరాలలో కన్పిస్తుంటే
వాటిననుభవించే మనసులో
అలజడి అలలసడి
ఆలోచనల్లో వడగళ్ళ జడి

నెత్తురు కురిసే హింసా మేఘాల నీడలో
కుత్తుక లెండే శాంతి కపోతాలు మనలేవు

తాటికాయలంత అశాంతి వార్తాక్షరాల ఛాయల్లో
చిటికెడు సంబరాలవార్త సంతోషపెట్టలేదు
గగుర్పాటు గలిగించే భయానకదృశ్యాల నేపథ్యంలో
కమనీయ చిత్ర సౌందర్యం కనువిందు కలిగించలేదు

నామనసు
శిరీషకుసుమ కోమలం
ఘర్షణలో హర్షాన్ని చూడలేదు
అశాంతి ముసుగులో ప్రశాంతిని కనలేదు
అందుకే
అందంగా కన్పిస్తున్నా
ఆనందంగా అందుకోలేను
అస్తవ్యస్త ప్రపంచ వృత్తాంత మాలికను
అనుదిన వార్తాపత్రికను

(తెలుగు విద్యార్థి, మార్చి '90)

జరాసంధీయం

పెంపుడు చిలుకపలుకుల్లా వల్లెవేసే నీతివాక్యాలూ
దీన జనోద్ధరణ ఆలాపాలూ -
బురదలోని ముసలి పులిలా
బుర్రలో వంచనా శిల్పాలూ
బూర్జువా ఆలోచనలూ -
కలిస్తే ఒక రాజకీయ జరాసంధీయం

కలంపాళీ కల్పించే కమనీయ గాథలూ
కమ్మని కవిత్వాలూ -
కవి దిన చర్యలలో తారాడే
సప్తవ్యసనాలూ సాహంకార దర్పాలూ -
కలిస్తే ఒక సాహిత్య జరాసంధీయం

ప్రతి రంగంలోనూ ఉన్నదే
ఈ జరాసంధీయ ప్రవృత్తి
పతనమై పోతోంది దీనితో
మానవ నైతిక సంపత్తి
కుళ్ళు ఆలోచనల మానసిక భ్రష్టత్వం
తుళ్ళే మమకారాల వాగ్విలసత్వం
అధికార బాధ్యతలతో అభిమాన దురభిమానాలూ
పరస్పరాకర్షణగల
విజాతి అయస్కాంత ధృవాల్లా
కలిసిన ఈ ప్రవృత్తిలో
విచక్షణ, వివేకం ఏకమై
పెనగి వాటిని వేరుచేసినా
చూస్తుండగానే మళ్ళీ
చుట్టేసుకొంటున్నాయి
శాశ్వతంగా రెంటినీ వేరుచేసే కిటుకు తెలిసినా
శక్తి చాల దందుకు నీకూనాకూ
అందుకే తమ్ముడూ! ఒప్పేసుకొందాం
మళ్ళీ మనం భీములమై
మన భారతాన వెలిసేదాకా
ఈ జరాసంధ ప్రవృత్తిని
మార్చివేయలేమని
మట్టుబెట్ట లేమని

(స్రవంతి, మార్చి-ఏప్రిల్ '96)

అపేక్ష

చీకట్లు ముసిరిన లోకంలో ఏకాంతంగా నిలబడి
నీ కొరకే ఎదురు చూస్తున్నాను చెలీ !
నీ నిర్మల ముఖ చంద్ర చంద్రికా తరంగాలలో
నిమగ్నమౌదామని
క్రాంతి మార్గాన సాగే నీతో కలిసి నడవాలనీ
ఆశతో ఎదురు చూస్తున్నాను
నువు ఏ మాత్రం జాగుచేసినా
నా కాలొకచోట నిలుపలేను
నాలుగు వీధులు తిరుగుతాను నీకై
ఆ వీధుల్లో ...

శ్రుతిమించిన నాగరికత లయలేక వికటంగా నర్తిస్తుంటే
పూటగడవని పేద కడుపులు పాటపాడుతుంటాయి
విషాదరాగాలతో; విగళితాశ్రుజలతరంగిణులతో

అంగడి ప్రాంగణంలో అడుగు పెట్టలేక
సామాన్యుడు ఆకాశంవైపు చూస్తుంటాడు
ఆనాటి అవసరాలను ఏకరువు పెట్టిన
అర్థాంగి మాటలు మననం చేసికొంటూ
అందని ధరల చుక్కల్ని అంచనా వేస్తూ

శృంగాటకంలోని శృంగార వేదిక మీద
చేతులెత్తి నిలబెట్టిన జనానికి
శిశిరాన్నే వసంతంగా చిత్రించి చూపుతుంటాడు
విభజించి పాలించే విద్యనేర్చిన నాయకుడు
ఇజాల మోజులోపడ్డ ప్రజకు
నిజానిజాలతో నిమిత్తమే లేదు

ఊరవతల రైలుపట్టాలపై
రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ జరుపుతున్న
నిరుద్యోగుల నిశ్వాసాలలో నిరాశా నిస్పృహలలో
నక్సలైట్ల పొగలు ; నేటి వ్యవస్థపై సెగలూ

ఇంకో నాలుగడుగులలో కనిపిస్తుంది
ఇంకిపోయిన చెరువు
దాన్ని చూస్తేచాలు గుర్తుకొస్తుంది
అహర్నిశలూ శ్రమించే రైతు గుండెల బరువు

ఈ బాధామయ ప్రపంచ గాథ లగాధాలు చెలీ !
ఒంటరిగా తిరిగితే ఒడ్డు చేరుకోలేము
చేయి చేయి కలిపితే చెంగున దూకేయగలము
అందుకే ఆలసించకు

కారుచీకటి తెరలు తెస్తూ
బ్రతుకు వెలుగును కప్పజూచే
మేఘమాలకు ఝంఝవై

విశ్వమానవ వియత్పథానికి
విధూదయమై వెలుగునిచ్చే
గీతరచనకు స్ఫూర్తివై

అశ్రుధారల మునిగిపోతూ
అలమటించే పిరికి గుండెకు
ధైర్యమిచ్చే మూర్తివై

నెర్రెలుకొట్టిన హృత్క్షేత్రంలో
ఆశల పచ్చిక పానుపు పెంచే
చల్లని వాన కార్తెవై

నిప్పులకాలే మానవతా హృది
తేనెల వానల చిప్పిల జేసే
అద్భుత నూత్న వార్తవై

భువన భవన ప్రాంగణస్థిత
భద్రపీఠిక నధివసించే
క్రొత్త పెండ్లి కుమార్తెవై
రా ! చెలీ ! రా !

(తెలుగు విద్యార్థి, సెప్టెంబరు '88)

షష్టి పూర్తి

కాలపురుషుని షష్టిపూర్తికి కదలి రండోయ్ నిఖిలప్రజలు
ఘనముగా ఈ సంబరాన్ని గర్వపడుతూ జరుపుకొందాం

జరిగిపోయిన షష్టి పూర్తి స్మృతులు వృద్ధులకే పరిమితం
మరల వచ్చే షష్టి పూర్తికి మన చిన్నారులే పెద్దమనుషులు

నేటిపండుగ మరల వచ్చే నాటి కెందరు నిలువగలరో
ఘనముగా ఈ సంబరాన్ని గర్వపడుతూ జరుపుకొందాం

షష్టిపూర్తికి షష్టిపూర్తికి చాల తేడా కలదు చూచిన
కాలపురుషుని గంభీరముఖ కవళికల కనిపెట్టలేమది

ఈ మహోత్సవ మతని కెన్నవదో మనము మది గణింపలేము
ఏ మహోత్సవ రీతులెట్టివో ఎరుగగా మన శక్తిచాలదు

ఎట్టి కైంకర్యములొనర్చి ఏమి పొందిరో పూర్వులార్యులు
తుష్టిగా నొనరించి మనమును ఇష్టకామ్యము పొందవచ్చును

కనుక రండోయ్ కదలి రండోయ్ కాలపురుషుని వేడుకొందాం
షష్టి పూర్తికి మనకు బహుమతి సంతసమ్మున నొసగు నాతడు

ఈతిబాధలు అవినీతి కథ లింక భరతావనిని వీడగ
నేటి భారత ప్రజా మానస పేటికల గల కలుషపంకము
చెచ్చెరన్ దొలగించి నిర్మల శ్రీలనింపగ ప్రేమ పంచగ
ఉన్నకొంపకు నిప్పు పెట్టే ఊహలన్నిటి తగులబెట్టగ
తప్పిపోయిన అహింసాశిశు తల్లజుని మన కప్పగించగ
కాలపురుషుని వేడుకొందాం కదలిరండోయ్ కదలిరండి

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)

స్వర్ణోత్సవ గీతం

స్వాతంత్ర్య స్వర్ణోత్సవం
మహదానంద దివ్యోత్సవం
నవభారత ప్రజావళికి
ప్రవిమల సుందరధాత్రికి ॥

మువ్వన్నెల జెండాకు పున్నెము పండినవేళ
తన నీడన కోట్ల ప్రజల నడిపించే శుభవేళ ॥
శతాబ్దాలు వందలాది విదేశీయ సేనానులు
కొల్లగొట్ట వివర్ణయై తేరుకొన్న భరతమాత ॥
అహింసారణమైనా అసువులు బాసిరి ఎందరో
త్యాగధనుల కృషిఫలితము దేశభక్తి సంభరితము ॥
ఒక తిలకు ఒక గాంధి ఒక నెహ్రూ ఒక పటేలు
ఒక సుభాసు ఒక శాస్త్రి కన్న కలల ప్రతిరూపం ॥
ఇక్కట్టుల నధిగమించి ఏబదేండ్ల చరిత్రలో
ఏటి కొక్కమెట్టునెక్కి శిఖరారోహణ చేసే ॥
కొన్ని కలలు ఫలించినవి కొన్ని కలలు శిలలైనవి
మొక్కవోని ధైర్యమూని ముందుకు సాగే జాతికి ॥

హింసాగ్నికి ఆజ్యధార లవినీతికి హారతులు
అందించేవారినణచి శాంతిశ్రీకరమయ్యే ॥
చీకటి కుట్రల సంస్కృతి సమూలంగా పెకలించే
అగణిత సూర్యోదయాల నాశించే యువభారతి ॥
అంతరిక్ష ప్రయోగాల అత్యద్భుత ఫలితాలు
పంచవర్ష ప్రణాళికల పురోగతులు కలగలిపిన ॥
గతచరిత్ర నెమరువేసి తప్పొప్పలు తెలుసుకొని
స్వారాజ్యమె లక్ష్యముగా సాగే భారతజాతికి ॥

(స్రవంతి, అక్టోబరు '97)

జెండా పాట

ఎగురుతోంది మువ్వన్నెల జెండా
ఎగురుతోంది మనజాతి పతాకం
రెపరెపరెప రెపరెపరెపరెపరెప ॥

ఈ జెండా మా ప్రాణసమానం
ఈ జెండా మా ఆశలరూపం
కష్టనష్టములు లెక్కచేయక
చెక్కుచెదరని ఆత్మస్థైర్యమున ॥ఎగురుతోంది॥

సైనిక వరులకు సమరోత్సాహం
కర్షకజనులకు కరుణాహృదయం
పరిపాలకులకు స్ఫటికస్వాంతం
ప్రసాదింతునని ప్రతిన చేయుచు ॥ఎగురుతోంది॥

నిర్భయముగ ఈ జెండానీడన
నిలబడి మేము పురోగమిస్తాం
విశాల విశ్వ ప్రజల కందరికి
మార్గదర్శినై మనగలనంటూ ॥ఎగురుతోంది॥

(తెలుగు విద్యార్థి '87)

జనయిత్రీ ! శుభధాత్రీ !

వందే సుందర జనయిత్రీం
వందే పావన శుభధాత్రీం ॥వందే॥

వాయవ్యస్థిత సింధుధునీం
ఉత్తర సుస్థిర శీతగిరిం
ఈశాశాయాం బ్రహ్మనదీం
త్రిదిశ సముద్ర పరీత ధరిత్రీం ॥వందే॥

తవ సలిలాన్న ప్రవర్థిత కాయః
తవ సేవార్థ మిదం మే శపథః
హే జనని! త్వామని శమజయ్యాం
వైభవయుక్తా మివ రక్షేయం ॥వందే॥

సర్వజీవహిత! హే జగదీశ్వర!
సస్యశ్యామల రత్నగర్భ శుభ
మాతృభూమి సంసేవా యత్నే
దేహ్యావలంబన మస్మాకం ॥వందే॥

(తెలుగు విద్యార్థి)

గురుపూజ

వందనాల చందనాల నందిద్దాము
గురుజనులకు కృతజ్ఞతలు చెల్లిద్దాము!!
రండో విద్యార్థులార!
రండోయీ జనులార! ॥వందనాల॥

గురువు తల్లి గురువు తండ్రి
గురువే పరదైవతము

సరిలేరుగ సద్గురువుకు
సరగున కొలువగ రండిటు
॥వందనాల॥

పశులకు మనిషికి భేదము
విశదపరచు విద్యనేర్పి
పసిమనసుల పండజేయు
అసమాన సుధీజనులకు
॥వందనాల॥

అజ్ఞానపు చీకటులను
విజ్ఞానపు వెలుగులతో
అంతరింపజేసి మదికి
శాంతమునొసగే ఋషులకు
॥వందనాల॥

మెట్లుకట్టి శిష్యకోటి
నెట్లొ పైకి పైకి నెట్టి
స్వర్గ సౌధమును చేరే
మార్గముచూపే ఘనులకు
॥వందనాలు॥

రాధాకృష్ణుడు పుట్టిన
రమ్యదినోత్సవము నేడు
రండి రండి గురువులార
రక్తియు భక్తియు నిండగ
వందనాల చందనాల నందిస్తాము
గురుజనులకు కృతజ్ఞతలు చెల్లిస్తాము

(తెలుగు విద్యార్థి, సెప్టెంబరు '89)

సమాధిపై సంచలనం

గోరి మృతదేహమున్నది, గోరి పైన
విరిసె పచ్చిక; యది లోని విగతజీవి
సత్యజీవన చిహ్నము; శవమునుండి
యవతరించెను ప్రాణము యవసమందు.

దేహమెంతగ మట్టిలోఁ దిరిగి కలియు
నంతగాఁ బచ్చదనమున నలరె గడ్డి
మృతుని జీవము గడ్డిలో మెదలసాగె
చావు నవజీవనమ్ముగా సంక్రమించె.

మృతుని నిర్జీవచికురంబు లతి నిగూఢ
మూలములు గడ్డి పోఁచల మొదలిపట్టు
లవనిలో జొచ్చుకొన్నవి జవముగల్గి
జీవమీరీతి-వెడలె నిర్జీవినుండి.

గడ్డిపూలలో మృతజీవి కండ్లు వెలసి
తొంగి చూచు ప్రపంచంబుఁ దొలుత నతడు
అనుభవించిన వివిధ వర్ణాను రాగ
గాన పరిమళ స్పర్శ సంగతుల దాని.

ధూమ్ర వర్ణోపశోభిత కమ్ర కుసుమ
సంచయంబులు శిరములు వంచెనవిగో
వర్షఋతువున సాగు తుంపరల దోఁగి
కల్లలై నట్టి వెనుకటి కలలఁ దలచి.

నిన్న యవల పర్ణంబుగా నున్న కొమ్మ
చెలగి యీనాడు పచ్చని చిగురుఁ దొడిగె

నదియె మొనమొన్న నిర్జీవమైన మోడు
మరణమే జీవసృష్టికి మార్గమయ్యె.

నూతనోదయ కాంక్షచే నూలుకొనుచు
ప్రాణి మృత్యువులోఁ దాను లీనమగును
కాలవశమున రూప భేదాలు గాంచు
నాత్మమారదు జీవము నారిపోదు
పారి సమాధిపై లేగడ్డి పుట్టినటుల.

పత్ర పుష్పతరుపతత్రి మానవ పశు
బృందమణగు శూన్యమందు; గాని
సాగుఁ దత్తజ్జీవ సంకేతములు శాశ్వ
తంబులై నిలిచి లోకంబునందు
నాకు పచ్చదనము నలరుల యందము
తరువులన్నిట గల్గు పెరుగుదలయు
పక్షుల గమనంబు పశువుల హృద్వృత్తి
మనుజులధీశక్తి మాయవెపుడు

శాశ్వతత్వమె బ్రతుకు ; శాశ్వతము జీవ ;
మిక నశాశ్వతజీవ మీ యిలను లేదు
బ్రతుకు లేనట్టి శాశ్వతత్వమును లేదు
వెల్ల చీకటి నల్లని వెలుగు రీతి.

(డా. సంజీవదేవ్ గారి "గ్రాస్ ఆన్ ది గ్రేవ్" ఆంగ్ల కవితకు అనువాదము)

(భారతి, జూలై '82)

కరుణశ్రీ

ఝల్లుమనె గుండె, కన్నుల వెల్లివిరిసె
నశ్రుధారలు చీకటి యావహించె
పత్రికల నీవు లేవను వార్త చదువ
మాట పెగలదు కరుణశ్రీ! మాన్యసుకవి!

ముద్దులు మూటకట్టు కడు ముచ్చట గూర్చుచు మోహపెట్టు నీ
పద్దెము పండిత ప్రతతి పామరలోకము నొక్కరీతిగా
నద్దితివేమొ లేఖిని ననంత సుధారస పాకమందు న
ట్లద్దకయున్న కాలగతి కాగక యీ గతి నిల్వ జాలునా!

నీ రమణీయ పద్యలయ నేర్చి గళంబున నార్తి నింపి పాం
గారెడి భావ సంపదల నద్భుతరీతి స్రవింప జేసి సిం
గారము గూర్చె పద్యముకు గాయక రత్నము ఘంటసాల యా
తారక చంద్ర సూర్య మిల తాల్చును మీదగు కీర్తి చంద్రికల్

నీ కాయము మరుగైనను
ఏ కాలము తెలుగు వారి హృదయామనిలో
నీ కవితా కుసుమావళి
ఊకో జెప్పన్ సతంబు నో కరుణశ్రీ !

(స్రవంతి, ఆగష్టు '92)

మానవతా! నీ కోసం

హిమబిందువులు మౌక్తికేద్ధసరములుగా
గై సేసె ప్రత్యూష కాలకాంత
చంద్రికారస మంగచర్చానుకూలమై
చన పూసి వెలబారె చందమామ
తీవ్ర సంవేదనా దీర్ఘ నిశ్వాసాల
విడె నసకృత్తుగా పిల్లగాలి
కరుణాత్మకా యిట్టి గతియని కాల్దువ్వి
రెక్కలల్లాడించె కుక్కుటములు

విధురగీతుల బాడెను విహగకులము
మంచు కన్నీటి గార్చె వేమారు చుక్క
లాత్మవై వర్ణ్యమును బహిరంగ పరచి
ఖిన్నుడై పొడమె తరణి ఖేతలమున

దుష్టదుర్మార్గ దుర్నీతి దోషహృదుల
యాభిచారము దినపత్రికాళి గాంచి
తద్దమూర్ఛిల్లు మానవతా లతాంగి
గనుచు విలపించు నా రీతి దినము ప్రకృతి

పరరాజ్య విజిగీషఁ బ్రబలు నాజులులేవు
ప్రజల గుంపుగ జంపు రుజలులేవు
కూటికై తప్పని గొడ్డు చాకిరిలేదు
కనుగప్ప ముసురు చీకట్లు లేవు
పరపీడనము లేదు భావదాస్యము లేదు
దైన్య నైరాశ్య బోధనలు లేవు
స్వాతంత్ర్యమను దివ్య పారిజాతపు నీడ
వలచి భారతమాత నిలిచియున్న

దిట్టి యీవేళ పులకలు పుట్ట నలరి
క్రాలవలసిన మానవతా లతాంగి
కూలు టతి ఘోర మామెను కేలుపట్టి
మరల మనజేయు బాధ్యత మనది మనది

నిర్మించుకొన్నచో నీతిప్రపుష్టమౌ
నిజమైన స్వారాజ్య నిభృత గృహము
పోషించుకొన్నచో పుణ్యభూమి ఖ్యాతి
భూజమ్ము దృఢమతి భువనమలర
స్థాపించుకొన్నచో సత్య ధర్మ ధ్వజ
చ్ఛాయలో సుందర శాంతివనము
వర్ధిల్లగా ఋజువర్తనోజ్జ్వలమైన
బ్రతుకుల నన్యోన్య భావమెసగ

దైన్యమును మాని మానవతాలతాంగి
నిత్యసంతోషి తాత్మయై నెగడ గలదు
తగిన కృషిలేక ఫల కాంక్ష తగదు చేయ
కాన తమ్ముడ! కృషి సల్ప కదలిరమ్ము.

(స్రవంతి, సెప్టెంబరు '92)

మకర సంక్రాంతి

సుప్తహృదికి చైతన్యపు చురకత్తులు
సప్తాశ్వుని గమనానికి సరిహద్దులు
సకల వ్యధా వనవాటికి జ్వలనార్చులు
మకర సంక్రాంతి దివ్య మంగళాహోలు

ధాన్యలక్ష్మి కర్షక గృహ ద్వారస్థిత
పౌష్యలక్ష్మి పల్లెపల్లె బహుజనహిత

భూలక్ష్మికి ఒళ్ళంతా పులకరింత
మకర సంక్రాంతి దివ్య మహిమ యిదంత

ముగ్గులతో గొబ్బిళ్ళతో ముంగిళ్ళు
పసుపులతో తోరణాల వాకిళ్ళు
వరసలైన హృదయాల్లో పరవళ్ళు
మకర సంక్రాంతి కోరు మామూళ్ళు

శరజ్జ్యోత్స్నలై మనసుల విరబూస్తాయి
మలయ పవన డింభకులై మది దోస్తాయి
ఉత్సాహపు లాహిరిలో ఊగిస్తాయి
సంకురాత్రి సంబరాలు సాటిలేనివోయి

(ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, 16-1-87)

అప్పగింత

(నేపాలులో ప్రతి లక్షమంది గర్భస్థ స్త్రీలలో 830 మంది ప్రసవ సమయంలో మరణిస్తున్నారని 14-3-94 ఆంధ్రప్రభ వార్త. భారతదేశంలో ప్రతి 6 నిమిషాలకు ఒక మాతృమూర్తి (గర్భిణి గాని, 42 రోజులు దాటని బాలెంత గాని) దుర్మరణం పాలౌతున్నదని ఇటీవల నిర్వహించబడిన ఒక 'సర్వే' లో వెల్లడయింది.)

కాన్పు కష్టమైన గర్భకోశము కోసి
ఇంతి కాడుబిడ్డ నిచ్చె వైద్యు
డంత మూడవదిన మా యింతి తనచావు
నెరిగి భర్త జూచి ఇట్టులనియె.

ఈ పసికూన ఒంటితడియింకను ఆరని దమ్మ పాలలో
తీపి నెరుంగ జాలనిది దేవత రూపున పుట్టె చూడుడీ
ఆ పసిరెప్పలం దెరచి అమ్మను నాన్న గనంగలేని నా
పాపకు ఏవిధిందెలియు బండిన నా కలలోని వేదనల్

ఎంతధన మెంతవైద్య మికెన్నినోము
లెన్నిముడుపులు మ్రొక్కులీచిన్నికొరకు
అన్నిటిని మించి ప్రసవ మాపన్నమైన
కడుపు కోయుట కోర్చి నే కంటి దీని.

పాలు తేనెల రీతిగా కాలమెల్ల
గడిపితిమి కాదె అన్యోన్యగౌరవమున
కాలవశమున నేడు నే గలసిపోదు
మట్టిలో, కాని మీ మది మాసిపోను.

ఇన్నేళ్ళ దాంపత్య మిచ్చిన ఫలమిది
తల్లి లేదని లోటు తలచకండి
పుట్టి తల్లిని పొట్ట బెట్టుకొన్నదటంచు
నెంచి చిన్నారి నిందించకండి
తన జన్మకై మన మనుభవించిన చిత్త
సంక్షోభమెరిగి కేల్జారకండి
పాప పుట్టిన పెంచు పద్ధతుల గురించి
మనమాడు మాటలు మరువకండి

ఇన్నినాళ్ళుగ నన్ను మీ రేవిధాన
ఎంతప్రేమగ చూచిరో అంతకంటె
మిన్నగా చూతురని నాదు చిన్నితల్లి
నప్పగించుచు నుంటి మీ హస్తయుగళి.

ఇన్నినోములు నోచి కన్న నా ఫలమేది
కనిన వెంటనె వల్లకాడు పిలిచె
తల్లినైనా నన్న తనివేది, నాతల్లి
కడుపారగా పాలు కుడుపనైతి

సంతానమో రామచంద్రా! అనిననోట
సంతుగల్గిన పిల్వజాలనైతి
గొడ్రాలిబ్రతుకేల కోట్లేల అనియెడు
అమ్మలక్కల మెప్ప నందనైతి

భాగ్యమిట్లుండె నాకు, మీభావికాల
మెంతదుర్భరమో కదా ! ఇంతిలేక
భర్తగోల్పోయి బ్రతుకు అభాగ్యురాలి
నరుణ నామిత్రురాలి పెండ్లాడ వలయు.

మధ్యాక్కర

ఈవిధియేలన నీ పసిబిడ్డ నింకెవ్వరైన
తావిచ్చి పోషించ రదియునుగాక దైవోపహతుల
దైవోపహతులె కాదన్న ననుకంప దరిజేర్తురెవరు
కావున నామాట కడసారిమాట కాదనకండి.

అనుచు అర్థించు అర్ధాంగి కనులనుండి
గుండెవేదన మనసు సంక్షోభమెల్ల
భాష్పధారల రూపున బయలు పడగ
నార్తి కరమున కరముంచి అనియె భర్త.

పాపనొసగిన దైవమే పండువంటి
కాపురంబున చిచ్చిడె కరుణలేక
నేను జీవచ్ఛవంబునై నీవులేని
బ్రతుకు నీడ్చెద మనప్రేమఫలము గనుచు.

గుండెను మార్చి కొంగ్రొత్తగుండెను గూర్చి
చావునాపగ జాలు శస్త్రవైద్యు
లంగాంగముల జాడ్యమంతయు తెరమీద
చక్కగ చూపించు సాధనములు

దీర్ఘవ్యాధుల నెల్ల తృప్తిగ తగ్గించు
అద్భుతంబైనట్టి ఔషధములు
సకలసౌకర్యమ్ములకు నిలయమ్ములై
అవతరించిన క్రొత్త ఆసుపత్రు
లుండ నా భాగ్యహీనత నొక్కకాన్పు
కిట్టు నీప్రాణముల్‌దీయ నెంచె విధియు
కాన్పుకాన్పుకు శిశువును కడుపుకోసి
తీయ జీవింతు రెందరో స్త్రీజనాళి.

అనుచు తనభర్త వ్యధచెందు నవసరమున
అదియె తుదిశ్వాస అని తాను మదినెరింగి
భర్త గనులార జూచి నా పలుకు నిలుపు
డనుచు నిర్జీవియయ్యె నా ఆడపడుచు.

వైద్యసౌకర్యములు లేని పాతరోజు
లందు కనలేక విడిచిరి అసువులతివ
లిప్పడారీతి నున్న నింకెపుడువచ్చు
పురిటి చావులు లేని ఆ పుణ్యదినము.

(స్రవంతి, మే '88)

కవిరాజు

వీరగంధముదీసి వీరవర్ముల బిల్చి
పూని మైనిండుగా బూసినావు
'వేనరాజు' నెదిర్చి 'ఖూనీ' ని రచియించి
విప్లవ బీజాలు విత్తినావు
నిఖిలశాస్త్ర పురాణ నికరంబు పరికించి
సరిక్రొత్త వెలుగుల బరపినావు

సూతపురాణంబు సూత్రించి జగతిలో
స్థిరయశోధనుడవై చెలగినావు

సంఘమున గల బహుదుష్ట సంప్రదాయ
ములను రూపఱ జేయగా బూనినావు
సాధు నీ కృషి యనితర సాధ్యము గద
భావ విప్లవ నలిన సంభవ! మహాత్మ.

రామరాజ్యము

రామునకు పుత్రులిద్దరు ; రమణి సీత
కొక్కకానుపె యదిగదా చక్కనైన
రామరాజ్యము; మనకది రాకపోదు
నవ్యదంపతు లా బాట నడచి నపుడు

సంస్మరణ

జాతిగర్వింప సాహిత్య జగతి నెవడు
నీతిమంత ప్రభుత్వమ్ము నెరపినాడు
అతడహో ! మధునాపంతుల తపసి కవి
సత్యనారాయణుడు సరస్వతి సుతుండు.

తెలుగువారల కీర్తికి తేజమెసగ
రచన గావించె నాంధ్రపురాణ కావ్య
మాధునిక పంచకావ్యాల నది ప్రసిద్ధ
మమృతోక్తుల ధారల కాటపట్టు.

వాద వివాదా వర్తము
లోదగులని వ్యక్తి యతడు లోకాదరతన్
మేదురకీర్తి గడించెను
లేదిక మన తెలుగుదనము లేమిడి బడియెన్.

నన్నయ్యవంటి వాడని
ఎన్నిక కాబడిన కవి కి కేలా బిరుదుల్
ఎన్నిభవంబుల పుణ్య మొ
కన్నది యీ దేశమాత కడుపారంగా.

పద్య కవితా మహారథుల్ వసుధవీడ
నద్యతన తెన్గుభారతి యార్తి గుందె
తెలుగుపాఠక హృదయాలు తేనె ముంచ
నెవరు సృజియింప గలరట్టి కవన మిపుడు !

(సమాలోచన, 16-10-94)

ఆరు సారా పద్యాలు

సంసారాలను గూల్చును
హింసా రాజ్యమ్ముబెంచు నెల్లిదపరచున్
కంసారాతిజని స్థా
నం సారా చూపు దాని నాశము వలతున్

మనసారా వాంఛించిరి
ఘనసారాదులను నాటికవు, లీనాడున్
మనసారా వాంఛింతురు
ఘన 'సారా' వాంఛ మాన గా ప్రజ, సుకవుల్.

మదికి కులాసారాదని
అదియే జీవితపుసార మని భ్రమపడుచున్
వదలక నిత్యము సారా
వెధవలు త్రాగుదురుసారవేదులు నొవ్వన్

కలహంసా రావమ్ముల
నెలవౌ కాసార పుణ్య నీరమె హితమౌ
వెలగల సారా కంటెను
వలదిక తాత్సార మన్న ! వర్జింపంగన్

సారాను తాగు మగల వ
సారాదరి జేరుటైన సై పకుడని సం
సార స్త్రీలందరికిఁ బ్ర
సారాలను టీ.వి. చేయ సత్ఫలమబ్బున్.

ఆసారార్థటి సాగెడి
యీసారా మాన్పు యుద్ధ మింకింతింతై
వేసారనీక యాంధ్రుల
కీసారయినన్ జయమ్ము నిమ్ముగ నిడుతన్.

(సమాలోచన)

ఆఠ

మాట కవిత
నిత్య నవత
భళారె
సినారె

చరితార్థుడు

ఏండ్ల పూండ్లనుండి యెందరో బిడ్డల
కుగ్గుబాలతోటి యురుకు లెత్తు
విమల జలము దాపి కమనీయ కవితల
నేర్పె గుండ్లకమ్మ నెనరుటమ్మ.

ఆ తల్లి యొడిన పెరుగుచు
క్రైతలనల్లగల నేర్పు గసియించెను వి
ద్యాతత్త్వరుడయి యెవ్వం
డాతడు కాకాని పాపయాఖ్యుడు తెలియన్.

కవి పండిత పోషకుడై
కవిసత్తముడై వదాన్యఖనియై మునియై
ధ్రువతారయి యద్దంకికి
నవురా! కాకాని పాపయాఖ్యుడు మించెన్.

మించిన వేడుకతో స్థా
పించెను సాహిత్యసమితి నెజ్జిన పేరన్
పంచెను కవితాగంధము
నంచితముగ తెలుగువార లానందింపన్

హనుమచ్ఛతకము వ్రాసెను
కన చిత్రం బతని కవిత కానము యతికిన్
గణమును ప్రాసకు వెదకుట
ఘనులగు సత్కవుల బాణి కనదగు దానన్.

నను నభిమానించు మనీ
షుని మరణపువార్త దెలిసి శోకాత్ముడనై
తిని ; సంతాపము దెల్పుదు
మనుగడ చరితార్థమైన మాన్య చరితకున్

పశువైద్య ప్రశస్తి

శివుడు విష్ణువు బ్రహ్మంచు జెప్పనేల
వేల్పులెల్లరు పశుపక్షి వితతి నెక్కి
తిరుగు వారలె నీ శక్తి దెలియవారె
జయము పశువైద్యుడా! నీకుజయము జయము

ఇదిగో యిటనొప్పి యిట తీపు ఇచట మంట
యనిన రోగము బోల్చుట యబ్బురంబె
మూగజీవాల రోగాల బోల్తువీవు
జయము పశువైద్యుడా! నీకు జయము జయము

భూతదయ లేక కొందరు చేతికొలది
హింసగావింత్రు పశువుల హీనగతిని
నీవె వాటిని లాలించి ప్రోవవలయు
జయము పశువైద్యుడా! నీకు జయము జయము

జీవకారుణ్యమే నీకు జీవగఱ్ఱ
జంతు సంక్షేమమే నీకు జయపతాక
రైతు సంతృప్తియే నీకు రక్షరేకు
జయము పశువైద్యుడా! నీకు జయము జయము

పశులు పక్షులే దేశసంపదకు మూల
మవియె రైతాంగమున కెల్ల అర్థబలము
వాటినభివృద్ధియొనరించు వాడవీవు
జయము పశువైద్యుడా! నీకు జయము జయము

వైద్యశాస్త్రము పశువుల వలన బుట్టి
పశుల వల్లనే యభివృద్ధిబడయు చుండె
చాటి శక్యమ పశువైద్య శాస్త్ర మహిమ
జయము పశువైద్యుడా! నీకు జయము జయము

అజరామర వాఙ్మయమూర్తి

గాంధి యాస్థానకవి నేడు కన్నుమూయ
కార్చినది ధర్మదేవత కంటనీరు
ఆంధ్ర కవితా కుమారి ప్రత్యగ్ర కంఠ
హార తరళమ్ము తెగి భూమియందుడిందె

వాసి జగమెరిగినకవి! శ్రీ రమణుని భక్తు లాంధ్రిసిరి తుమ్మల సీ
తారామమూర్తి చౌదరి! పేరున వర్ధిలిరి కైత పెన్నిధియగుచున్

కంటినీరు తుడిచి కైవారములు చేసి
పదములొత్తి పూలపాన్పు వేసి
సేవచేయులెంక చేరగా స్వర్గమ్ము
దిక్కులేని దయ్యె తెనుగు వాణి

ఊడిగము చేసె భాషకు
లేడీ నాడితని సాటి లెంక ధరిత్రిన్
ఊడిగము చేసె గాంధీ
యాడిన మాటలకు హృదయమలరగనియతిన్

ఏనాటికో గదా యిక। నీ నేలను మరొక తిక్క ఋషి పుట్టి పసా
జాను తెనుంగున కృతులన్। మానుగ రచియించి ప్రజల
మన్నన గనుటల్

ఆ కాలమ్మున పోతన। ఈ కాలమునందు వీర లీ తెనుగింటన్
రూకను కోరక భాషకు। చాకిరి యొనరించినారు సర్వులు
మెచ్చన్

రేపుల దుక్కిదున్ని చెలరేగెడి వాఙ్మయ కాంక్షదీక్షగా
మాపుల మైళ్ళుమైళ్లు చని మాన్యగురూత్తము సేవలన్ మనః

తాపము దీర్చుకొంటివి సుధామధురోక్తుల తెన్గు బాసలో
నీ పస జూపి యాంధ్రజననీ హృది నిత్యుడవైతి సత్కవీ !

గీతను గాంధివినోబా । నేతల బోధనలనమ్మి నిజమగు మనుజ
వ్రాతములో మేల్బంతై । పూత చరిత్రుండవైతి పుణ్యాత్మ ! భళి !

జ్ఞానపీఠమె మీకు దక్కనిది యనుచు మాదృశులు చింతనొందక
మానలేరు
మీకు భుక్తోజ్ఝితము లహో ! మేటి బిరుదు లుర్వి మీసాటి
నిష్కాములున్నవారె !

ఈ శతాబ్దపు మలియేట నిచట పుట్టి కమ్మకైతల నాంధ్ర లోకమ్ము
నూపి
ఈ శతాబ్దాంత దశకాన మృతిని జెంది తీ శతాబ్దము నీదె
నీదే నిజమ్ము

భౌతికమైన దేహములు భస్మములౌ నెపుడైన, పుణ్య సం
జాత విశుద్ధ కావ్యములు శాశ్వతమై కవిపేరు ధాత్రి వి
ఖ్యాతి నొనర్చు గాన మృతి గల్గదు సత్కవిరాజ కోటికిన్
ఆ తరణీందు వౌచు నజరామర వాఙ్మయమూర్తి ! వెల్గెడిన్.

పరివేదనము

చేత మీట పట్టి చిహ్నిత స్థలమున
ధ్వంస రచన జేయు వంచకులకు
ప్రాణములను దీయు పని వెన్నతో బెట్టు
విద్యయయ్యె హత్య వేడు కయ్యె.

పగ విద్వేషము అక్కసు
రగిలిన మది శాంతభావ రహితంబగుచున్

పొగ లెగయజిమ్ము మానవు
నొగి దానవుగా నొనర్చి యోర్మింజెరచున్

మానవధర్మ కర్మములు మానినవారల తోటి మానవున్
మానవుగా గణించని ప్రమత్తుల నారని కడ్డు మంటతో
తానొనరించు కర్మములె ధర్మములంచెదనెంచు బాధ్యతా
హీనుల బల్వురన్ గనగ నేటికి భారతమాత! తెల్పవే

అట్టి ప్రజలు హింస హత్యాది కర్మల
నభము శుభము తెలియనట్టి వారి
నమల కీర్తియుతుల నగ్రనాయకులను
చంపుచున్నవారు చలముపట్టి.

తన ప్రాణ పరిత్యాగము
నొనరింపగ సిద్ధపడిన నొరు నుసురును తీ
యను వెనుకాడడు నరు డై
నను తగునటమ్మ యిట్టినాశపు బుద్ధుల్

ఈ పెడబుద్ధులే మునుపు హేయముగా మన బాపు శాంతి స
త్యాపర బుద్ధమూర్తిని హిమాచల సాగరవేష్టితావనీ
స్థాపిత గాణ తంత్ర్యనతి దారుణరీతి తుపాకి గుండుతో
రూపణ జేసె నెల్ల ప్రజ రోయగ మాయని మచ్చనిల్వగన్

పుణ్యభూమి యహింసకు పుట్టినిల్లు
భరత ఖండ మటంచు విశ్వము నుతించె
కాలగతి తీవ్రవాదము కాలుమోపి
పుట్టెడపకీర్తి కిరవయి పోయెనకట

కాంతులు చిమ్ము దీపము ప్రకాశ మొనర్చుచునుండు తన్ను త
త్ప్రాంత సమస్త వస్తుతతి తద్విధ మొప్పగ రాజకీయ వ్య

త్త్రాంత సుదీప్త బుద్ధి జనతా హృదయోల్ల సనంబొనర్చి తా
నెంతయు కీర్తిగాంచె నిల నిందిరగాంధి జగద్ధితాత్మయై

క్రూరులయి తనదు బంటులె
దారుణముగ జంప నామె ధరణీ స్థలిపై
బోరగిల బడియె లోకము
బోరున విలపింప శోకపూరితులగుచున్

తేజోవంతుడు ధీరచిత్తుడు సవిత్రీ బద్ధ రాగుండు ని
ర్వ్యాజస్వాంతుడఖండ భారత జనారాధ్యుండు రాజన్యుడై
రాజీవుండు ధరిత్రి నేలె భువన ప్రఖ్యాతిగా నంతటన్
జేజే వెట్టప్రజల్ యశోభరిత నిశ్శ్రేణీ సమారోహుడై

రాజకీయ కక్షరగుల మధ్యంతర
ఎన్నికల ప్రచార మెసక మెసగు
వేళ జంపి రితని విద్రోహకారులు
ప్రబలమైన సీమ బాంబు పేల్చి

ఇంతకిరాతక క్రియకు నీ జగమంతయు తల్లడిల్లె నా
శాంత విశాల కీర్తియుతుడై పొగడొందిన జాతినేత నో
యింతి తెగించి చంపుటది యెంత విషాదము మృత్యు మాత కా
వంతయు జాలిలేదు కద హా! మనదుర్దశ కాదె యింతకున్

భారతమ్మెకాదు వసుధయంతయు శోక
వార్ధి మునిగె క్రోధ వహ్నియెగసె
తల్లడిల్లిరి జను లల్లాడి పోయిరి
దోపిడీలు చెలగ కాపు తొలగ

వామన మూర్తి రీతిగ నవారితలీల క్రమాభివృద్ధియై
తామితిమీరి యాకసము తాకె నరాచక చిత్తవృత్తి యా

భీమ పరిస్థితిం గెడపి ప్రేమము స్నేహము శాంత మీధరన్
ప్రామగ జేయునేతకయి ప్రార్థనసేయుదు నా పరాత్పరున్

గాంధి నెహ్రూ కుటుంబ సంబంధు లింత
శీఘ్రగతి చావునొందుట చెట్ట మనకు
నొక్క బాటపై దేశమ్ము నుంచగలుగు
శక్తియుతు డెవ్వ డాగామి సమయమునను ?

(స్రవంతి, జూన్ '91)

తెలుగువారి దివ్య తేజం

కోట్ల యాంధ్రుల గుండె కొలువుండి తొలితూరె
విజయధ్వజ మెగుర వేసినాడు
రాజకీయ మహోగ్ర గ్రహణంబు లెదిరించి
యసమాన తేజస్వియైనవాడు
తెలుగు భాషా సంస్కృతీరక్షణార్థమై
దీక్ష గైకొన్న సద్దేశికుండు
వివిధ కార్యక్రమ విధి నిర్వహణముల
నలసట గనని శ్రమైకజీవి

సేతు శీతాచలవ్యాప్త భూతలమున
ప్రాచ్య పాశ్చాత్య సర్వ ప్రపంచమందు
తెలుగువారికి గుర్తింపు తెచ్చినాడు
ముఖ్యమంత్రి రామారావు బుధులు మెచ్చ

చాపకూడును బెట్టి సమత బోధించిన
పలనాటి బ్రహ్మన్న పాటివాడు
దీనురాలైనట్టి తెలుగుతల్లిని యుద్ధ
రించిన కాపన్న మించినాడు

లలిత కళామాత గొలువ కర్పూర వ
సంతరాయల సాటి పంతకాడు
జనరంజకముగ పాలన సేసినట్టి శ్రీ
కృష్ణరాయల మరపించువాడు

విమల కృష్ణానదీతీర విపుల భూమి
తెలుగుదనముట్టిపడ నూరు వెలయ జేసి
ఉత్సవముల మహానాడు నుచితరీతి
నిర్వహించి యజేయుడై నిలిచినాడు

ఇట్టి మహాపురుషుడు చే
పట్టిన పథకములు ప్రజకు బంగారములే
నెట్టుకొని ప్రజానీకము
కట్టిన పట్టమున నిల్చుగాక స్థిరంబై

తిరుమల శ్రీగిరినిలయులు
కరుణారస ముప్పతిల్ల కాపాడుదు రీ
నరపుంగవు నశ్రాంతము
పురుణించగ నింక నూరు పుట్టిన రోజుల్

నందమూరి వంశ నాయక రత్నంబు
తెలుగువారి కెల్ల దివ్యతేజ
మభ్యుదయ పరంపరాభివృద్ధిని గాంచి
నిష్కళంక చరిత నెగడు గాక !

పద్య హారతి

నిండగు వేదమార్గ పరినిష్ఠిత పావన ధర్మవర్తనుం
డొండు విచారశూన్యుఁడు గుణోత్తము డిద్ధుడు బ్రహ్మచారి మా
ర్తాండ సమాన తేజు డతి రమ్యతనుం డమృతోక్తి మంతుడౌ
పండిత గోపదేవ గురుపాద సరోజము లాశ్రయించెదన్.

తాతల నాటి నుండి కృషి ధర్మము తప్ప మఱొండు నేర్వలీ
జాతి జనుల్ ఎదో కడుపు చల్లగ నేటికి నొక్కరుండు - ఆ
వ్రాత నెదిర్చి వైదిక సరస్వతి ముద్దుల పట్టియై పరం
జ్యోతిగ వెల్గ కమ్మకుల శోభలు మీరె తెనుంగు నేలపై.

కూచిపూడి వాసి కొమరు డంబాదేవి
రామయార్యులకును ప్రేమమూర్తి
బ్రహ్మవిదుడు సత్యపథగామి సద్యోగి
బోధగురుడు పరమ పూరుషుండు.

ఏ ఋషి వైదిక ఋగ్జాల మాత్మలో
దర్శించి ప్రవచించె తత్పరతన
ఏ ఋషి మానవ హితకారియై ధర్మ
పథము నిర్దేశించె ప్రజలకెల్ల
ఏ ఋషి తానిల్చి యేకైక శక్తిగా
భేదించె మిథ్యార్థ వేదభాష్య
మే ఋషి భారతీయేతిహాస పురాణ
పటలి దౌష్ట్యావళి బయలు పఱచె

కార్యకుశలత యాధ్యాత్మికతయు గలసి
యేకమై ప్రజ్వరిల్లిన వెవని యందు

ఆ దయానంద ఋషి మార్గ మనుసరించు
పరమ యోగీంద్రు డాదర్శ పురుషుడితడు.

ఆర్యసమాజ బీజముల నాంధ్రధరిత్రిని కూచిపూడిలో
ధైర్యము మీర నాటి శ్రమధారల నంకురిలంగ జేసి తా
త్పర్యము తోడ పెంచ నవి వర్ధిలె నేటికి పూలు పండ్లతో
నార్యుల సత్త్వయత్నములు వ్యర్థములౌనె తలంచిచూడగన్.

వైదిక సాహితీ కృషి నవారిత దీక్ష నొనర్చు సాధకుం
డాదరణీయమౌ తెనుగు నందు జనావళి మోదమంద గీ
తాదిగ బ్రహ్మ సూత్రముల నాగమ భాష్యము దర్శనంబులన్
సాదర బుద్ధి నయ్యుపనిషత్తుల వ్రాసె జగద్ధితాత్ముడై.

తొంబదెనిమిదేండ్ల దొడ్డప్రాయము నందు
నాంధ్రముగ నిరుక్త మనువదించె
ఆంధ్రవాణి కీతడనితర సాధ్యమౌ
సేవ చేసె నాడు చిత్తశుద్ధి.

పరిఢవిల్లగ నూఱేండ్ల ప్రాయమిపుడు
నూతనోత్సాహ దీప్తి ననుదినమును వ
చించు నత్యంత కరుణతో శిష్యతతికి
వైదికాచార యౌగిక ప్రవచనముల.

ఋషితుల్యులైన వీరల
కృషి యాదర్శము సమస్త గృహమేధులకున్
ఋషి ఋణము దీర్ప సత్పూ
రుషుల మయి మనుదము ధర్మరూపిత బుద్ధిన్.

ఆరోగ్యభాగ్యయుతులై
సారమనీష హృదయబల సంపన్నులునై

నూఱేమిటి మనగల రి
న్నూఱేండ్లును యోగజనిత నూతన శక్తిన్.

ఇట్టి మహానుభావునకు నీశ్వర తత్త్వ విశుద్ధ వేత్తకున్
పట్టిన ధర్మకేతునకు భాసుర దర్శనశాస్త్ర వేదికిన్
మట్టిన మానికంబునకు మచ్చయెఱుంగని పుణ్యశీలకిన్
పట్టెద పద్యహారతిని స్వాంత సముద్రము తృప్తి బొందగన్.

ఎక్కట్లు

కవిత యొక తీయ మామిడికాయ దాని
మధురిమను గ్రోలదలచిన మానవునకు
రీతి నెరిగింతురే కాని చేతనిడుచు
నమిలి యిత్తురె లోకులు నవ్వుకొనగ

చెరువులోని చేపఁ జెట్టుకొమ్మకు జేర్చి
ముంపు కాచితనుచు మురియు కోతి
ఎట్లెరుంగు ప్రకృతి; నిన కాంతిగనినంత
నుబ్బు డేగ, దాగు గబ్బిలంబు

కాలగతికి తగిన లీల మారుట ఒప్ప
సంప్రదాయమేని, చదువు లేని
వ్యక్తి ననుసరించి వస్త్రఖండముగాని
వైపరీత్య మగునె వసుధమీద.

ఎపుడు శిష్యులు తనయంత ఎదుగుదురను
చింతతో నుండు సతతము శ్రీగురుండు

శిష్యులెప్పుడు పాదాల చెంతనుండ
కోరుకొనుచుండు కుత్సిత గురుడు సతము

తత్త్వవేత్తయైన దైవదూతయె యైన
పంచవన్నె కలల భ్రమల మునిగి
నిద్ర జెందువాడు నిరుపయోగియె కాని
ఉద్ధరింపలేడు ఉర్విజనుల

ఒకరి కొకర మనెడి ఊహయే సంపద
ధనము, పసిడి కాదు దంపతులకు
ఆత్మతృప్తికన్న అధికమైనది లేదు
అని యెరింగి మసలుకొనుట లెస్స.

జీవితపు తత్త్వమెరిగిన జీవులెపుడు
బ్రతుకుదురు నిరాడంబర పథమునందు
మరి నిరాడంబరులయిన మానవాళి
సర్వులును తత్త్వమెరగిన జనులు కారు

సంఘమున మార్పు తేవలె చాలననుచు
బద్ధకంకణులైనట్టి ప్రజలు కనరు
ఎంత మార్పును తామొంది రింతకునని
తాను మారని వాడెట్లితరుల మార్చు ?

(భారతి, మార్చి '89)